



# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక







హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 127, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, బుధవారం - 12- జూన్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అంతరిక్ష కేంద్రంలో 'స్పేస్ బగ్' .. ఇబ్బందుల్లో సునీతా విలియమ్స్!



ఢిల్లీ : భారత సంతతికి చెందిన ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్(59) మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లారు. బోయింగ్ స్టార్‌లైనర్ అంతరిక్ష నౌక ద్వారా మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో సురక్షింతగా అంతరిక్ష కేంద్రం (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్)కు చేరుకున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీతా విలియమ్స్‌తో సహా 8 మంది సిబ్బందికి 'స్పేస్ బగ్' రూపంలో ఇబ్బంది వచ్చిపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సూపర్ బగ్‌గా పిలిచే 'ఎంటర్‌బాక్టర్ బుగాన్‌డెన్సిస్' అనే బాక్టీరియా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్ష వాతావరణంలో ఈ బ్యాక్టీరియా మరింత బలం పెంచుకుంటోందని తెలిపారు. ఇది అనేక ఔషదాలను నిరోధించగలిగే శక్తివంతమైనదని వివరించారు. ఈ బ్యాక్టీరియా మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ కావడం వల్ల దీన్ని 'సూపర్ బగ్'గా మిగతా..2లో

## మోదీ 3.0: తొలి బడ్జెట్‌లో ఆర్థిక ఎజెండాపై దృష్టి



ఢిల్లీ : కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు మరోసారి ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించారు. నూతన ప్రభుత్వం త్వరలో తన మొదటి బడ్జెట్‌ను సమర్పించనుంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతారామన్‌కు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఎలాంటి ప్రభావం చూపకుండా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే చర్యలను ప్రభుత్వం పరిశీలించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ పగ్గాలు చేపట్టిన సీతారామన్ తన ఆర్థిక ఎజెండాలో భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చుడానికి కృషి చేయాల్సి ఉంటుంది. అలాగే 2047 నాటికి దేశాన్ని 'అభివృద్ధి చెందిన భారతదేశం'గా మార్చుడానికి తగిన ఆ?ర్థిక సంస్కరణలను వేగవంతం చేసేదిశగా ముందడుగు వేయాలి. 2023-24 ఆర్థిక మిగతా..2లో

## బాబు నుంచి ఏపీ ఏమి ఆశిస్తోంది ?

టీడీపీ ఆవిర్భవించాక ఇంతటి విజయాన్ని దక్కించుకోలేదు

మూడు ప్రాంతాలలో సమగ్రాభివృద్ధి టీడీపీ కూటమి లక్ష్యం

ఏపీలో అప్పుల కుప్పగా అంతా ఉందని బాబు చెప్పుకొచ్చారు

జగన్ సంక్షేమ పధకాలు చాలా వరకూ అనర్హులకు కూడా వెళ్లాయి

అమరాతి: ఏపీ ప్రజలు ల్యాండ్ స్లైడ్ విక్టరీని టీడీపీ కూటమికి అందించారు. టీడీపీ ఆవిర్భవించాక ఇంతటి విజయాన్ని దక్కించుకోలేదు. మిగతా..2లో




వైసీపీ కంటే రెట్టింపు పథకాలు అని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ప్రచారం చేశారు. ఏపీలో ఎంత అప్పు ఉంది అన్నది తెలియదు అన్నారు. దిగేదాకా లోతు తెలియదని అందువల్ల మొత్తం స్టడీ చేయాలన్నది బాబు మాటల వెనక ఉన్న అర్థంగా భావించాలి.చాలా సేపు ఎన్డీయే సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు ఎక్కువగా అభివృద్ధి గురించే ప్రస్తావించడం గమనార్హం.

## బీఆర్ఎస్ కు షాక్.. కేసీఆర్ కు నోటీసులు..!



- "విద్యుత్ కొనుగోళ్లలో మీ పాత్ర ఏమిటి" నోటీసుల్లో పవర్ కమిషన్ నోటీసులు
- కేసీఆర్ ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు
- 2024, జూన్ 30వ తేదీ లోపు సమాధానం ఇవ్వాలి

## మూడు రోజులు వర్షాలు




## ఇంత ఘన విజయం సాధిస్తామని అనుకోలేదు



## మోదీ 3.0.. స్పీకర్.? పదవిలో కూర్చునేదెవరు?

న్యూఢిల్లీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం రాత్రి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. మోదీ సహా 72 మందితో కేంద్ర క్యాబినెట్ కూడా ఏర్పాటైంది. ప్రధాని, మంత్రులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. 30 మందికి క్యాబినెట్ మంత్రులుగా అవకాశం లభించింది. మరో ఐదుగురిని స్వతంత్ర హోదాతో సహాయ మంత్రులుగా, 36 మందిని సహాయ మంత్రులుగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కొత్తగా ఏర్పాటైన నరేంద్ర మోదీ క్యాబినెట్ తొలి సమావేశం సోమవారం జరగనునంది. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని లోక్‌కళ్యాణ్ మార్గ్‌లో మిగతా..2లో



వివరాలు 2లో..

## ఉద్యోగుల సమయపాలన పై ఫోకస్




- రుణమాఫీ అమలు చేయడానికి పక్క ప్రణాళికతో అధికారులు సిద్ధం అవ్వాలి
- ఆగస్టు 15వ తేదీన ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ చేసి తీరాలి
- బయోమెట్రిక్ విధానం అమలులోకి వస్తే ఉద్యోగులు కూడా టైమింగ్ పాటిస్తారు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో మళ్ళీ పాలన పైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా సమాలోచనలు జరుపుతున్నారు.

## కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు



వివరాలు 2లో..

ఢిల్లీ : కేంద్ర కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రధాన మంత్రి కేంద్రమంత్రులకు శాఖలను కేటాయించారు. ఆవాస్ యోజన పథకం కింద గ్రామీణ, పట్టణాల్లో 3కోట్ల గృహాలు నిర్మించేలా కేంద్ర కేబినెట్ నిర్ణయం మిగతా..2లో

## జైల్లో చంద్రబాబు నలిగిపోయారు: పవన్ కల్యాణ్


విజయవాడ ఏ కన్వెన్షన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాసన సభా పక్ష సమావేశం జరిగింది



వివరాలు 2లో..

అమరావతి: విజయవాడ ఏ కన్వెన్షన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాసన సభా పక్ష సమావేశం జరిగింది. కూటమి తరపున గెలుపొందిన ఎమ్మెల్యేలంతా ఈ సమావేశానికి హాజరై చంద్రబాబును ఎన్డీఏ కూటమి శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి అభ్యర్థిగా పవన్ ప్రతిపాదించగా...ఆ తీర్మానాన్ని కూటమి నేతలు ఏకగ్రీవంగా అంగీకరించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు పంపనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కూటమికి గవర్నర్ ఆహ్వానం పలకనున్నారు.

## తెలంగాణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని న్యాయం చేస్తా...



తెలంగాణ సీఎం, ఎంపీలు, కేంద్రమంత్రుల నుంచి విజ్ఞప్తులు వస్తే పరిష్కరిస్తానని హామీ

సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీ ద్వారా తెలంగాణ ప్రజలకు చేరువయ్యే అవకాశం దక్కిందని వ్యాఖ్య

తెలంగాణ ప్రాంతానికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తానన్న రామ్మోహన్ నాయుడు

## సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు శుభవార్త




వారసుల గరిష్ఠ వయోపరిమితి పెంపు

35 ఏళ్ల నుంచి 40కి పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం

2018 మార్చి 9 నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడి

## అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని

- శాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేసుకుందామన్న చంద్రబాబు
- సీఎం పదవి హోదా కోసమే తప్ప పెత్తనం కోసం కాదని వ్యాఖ్య
- కేంద్రం సహకారంతో పోలవరం పూర్తిచేస్తామని వివరణ
- తప్పు చేసినవాళ్లకు చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇకపై మూడు రాజధానులు అంటూ ఆటలాడే పరిస్థితి రాష్ట్రంలో ఉండదని తేల్చి చెప్పారు. విశాఖపట్నంను ఆర్థిక, ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. మిగతా..2లో

# అంతరిక్ష కేంద్రంలో 'స్పేస్ బగ్' .. ఇబ్బందుల్లో సునీతా విలియమ్స్!

మొదటి పేజి తరువాయి

అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీతా విలియమ్స్‌తో సహా 8 మంది సిబ్బందికి 'స్పేస్ బగ్' రూపంలో ఇబ్బంది వచ్చిపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సూపర్ బగ్‌గా పిలిచే 'ఎంటర్‌బాక్టర్ బుగాన్‌డెన్సిస్' అనే బాక్టీరియా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్ష వాతావరణంలో ఈ బ్యాక్టీరియా మరింత బలం పెంచుకుంటోందని తెలిపారు. ఇది అనేక ఔషదాలను నిరోధించగలిగే శక్తివంతమైనదని వివరించారు. ఈ బ్యాక్టీరియా మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ కావడం వల్ల దీన్ని 'సూపర్ బగ్'గా పిలుస్తారని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఇది శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఈ స్పేస్ బగ్‌తో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునితా విలియమ్స్ సహా మిగిలిన ఎనిమిది మంది సిబ్బంది ఇబ్బందుల్లో పడనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా అంతరిక్ష కేంద్రం.. కదిలే అంతరిక్ష శిధిలాల వల్ల ఆందోళన వ్యక్తం చేస్తుంది. అయితే ఒకరి నుంచి మరోకరి వ్యాపించే 'స్పేస్ బగ్' గత కొన్ని ఏళ్ల నుంచి అభివృద్ధి చెందటం మరింత ఆందోళన కలిగిస్తోందని శాస్త్రవేత్తలు పేర్కొటుంన్నారు. వ్యోమగాములు అంతరిక్ష యాత్రల సమయంలో ఆరోగ్యపరంగా సవాళ్లను ఎదుర్కొంటారని పరిశోధకులు అభిప్రాయన్నారు. ఆస్ట్రోనాట్స్ ఆరోపడుతుగ్యం కోసం 'స్పేస్ బగ్' ప్రభావాన్ని, ప్రతికూలతలను అంతరిక్ష కేంద్రం త్వరగా అంచనా వేయటం కీలమని పేర్కొంటున్నారు. సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఆస్ట్రోనాట్ బారీ యూజీన్ బుచ్ విల్మోర్ జూన్ 6, 2024 న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సునిత డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని కూడా వ్యక్తం చేశారు. అయితే వారు వారం రోజులు పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండి.. అనంతరం భూమిపైకి తిరిగి వస్తారు.

## మోదీ 3.0: తొలి బడ్జెట్‌లో ఆర్థిక ఎజెండాపై దృష్టి

మొదటి పేజి తరువాయి

నూతన ప్రభుత్వం త్వరలో తన మొదటి బడ్జెట్‌ను సమర్పించనుంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతారామన్‌కు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఎలాంటి ప్రభావం చూపకుండా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే చర్యలను ప్రభుత్వం పరిశీలించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ పగ్గాలు చేపట్టిన సీతారామన్ తన ఆర్థిక ఎజెండాలో భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి కృషి చేయాల్సి ఉంటుంది. అలాగే 2047 నాటికి దేశాన్ని 'అభివృద్ధి చెందిన భారతదేశం'గా మార్చడానికి తగిన ఆ?ర్థిక సంస్కరణలను వేగవంతం చేసేదిశగా ముందడుగు వేయాలి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిజర్వ్ బ్యాంక్ నుండి డివిడెండ్ రూపంలో ప్రభుత్వం అందుకున్న రూ. 2.11 లక్షల కోట్లు దేశ ఆర్థిక స్థితికి మెరుగుదలకు సహాయకారిగా మారినట్లు నిరూపితమయ్యింది. మోదీ 3.0 ప్రభుత్వానికి దేశంలోని వ్యవసాయ రంగంలో ఒత్తిడిని పరిష్కరించడం, ఉపాధి కల్పన, మూలధన వ్యయాల వేగాన్ని కొనసాగించడం, ఆర్థిక ఏకీకరణ మార్గంలో ఉండటానికి ఆదాయ వృద్ధిని పెంచడం వంటివి కీలకంగా మారనున్నాయి. మరోవైపు బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ కొంత వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు బీమా కంపెనీల ప్రైవేటీకరణకు పలు ఆటంకాలు ఏర్పడుతున్నాయనే వాదన వినిపిస్తోంది. నిర్మలా సీతారామన్ 2019లో తొలిసారిగా ఆర్థిక శాఖ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుండి ఆమె ఈ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. సీతారామన్ స్వతంత్ర భారతదేశంలో మొదటి పూర్తికాల మహిళా ఆర్థిక మంత్రిగా గుర్తింపు పొందారు. ఆమె ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో దేశం కోవిడ్ -19 మహమ్మారితో ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, వాటిని సమర్థవంతంగా దాటగలిగింది.

## మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తెలంగాణలో నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా ఉన్నాయి. నాలుగు రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వానలు, జల్లులు పడుతుండగా... మంగళ, బుధ, గురువారాల్లో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది.తుపవనాలు రాష్ట్రం మీదుగా సోమవారం మహారాష్ట్రలోని నాసిక్, సుకుమా తదితర ప్రాంతాలకు సైతం విస్తరించాయి. దీంతో అటు దక్షిణ మహారాష్ట్ర నుంచి తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశా, కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది. రాష్ట్రంలోని హైదరాబాద్ జిల్లాతో పాటు పరిసర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని తెలిపింది. యాదాద్రి-భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణ్‌పేట, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు నమోదవుతాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ హెల్ప్ డెస్క్ (ఫోన్ నంబర్లు: 040-21111111, 9001136675)ను ఏర్పాటు చేసింది. సోమవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 40.4 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.4 డిగ్రీ సెల్సియస్ నమోదైంది.

## ఇంత ఘన విజయం సాధిస్తామని అనుకోలేదు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన క్షణంలోనే విజయంపై అందరికీ నమ్మకం ఏర్పడిందని బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి చెప్పారు. అయితే, ఇంత ఘన విజయాన్ని మాత్రం ఊహించలేదని చెప్పుకొచ్చారు. కూటమికి ఇది అనూహ్య విజయమని చెప్పారు. ఈమేరకు మంగళవారం జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో పురందేశ్వరి మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిజమైన సంక్షేమానికి దూరమయ్యారని చెప్పారు. అభివృద్ధి అనే పదానికి అర్థం లేకుండా పోయిందన్నారు.లః ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించాలని నిర్ణయించుకున్న ప్రజలు.. కూటమికి అనూహ్య విజయాన్ని కట్టబెట్టారని, ఇందుకు వారికి సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని పురందేశ్వరి చెప్పారు. 'చంద్రబాబు యుక్తి, నరేంద్ర మోదీ స్ఫూర్తి, పవన్ కల్యాణ్ శక్తి.. ఈ మూడింటి కలయికే ఇవాళ రాష్ట్ర ప్రజల ముందుకు కూటమి రూపంలో వచ్చింది' అని చెప్పారు. ప్రజా సంక్షేమంపైనే దృష్టి పెట్టి, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో కక్షపూరిత రాజకీయాలకు తావివ్వకుండా పార్టీ కార్యకర్తలను సంయమనం పాటించేలా చూడాలని పురందేశ్వరి కూటమి నేతలకు సూచించారు. ఐదేళ్లలో కూటమిలోని పార్టీలకు చెందిన కార్యకర్తలు అనేక కష్టాల పాలయ్యారని, ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఈ సమయంలో ఒకింత అత్యుత్సాహం ప్రదర్శించకుండా మన కార్యకర్తలను శాంతింపజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడు పేరును పవన్ కల్యాణ్ ప్రతిపాదించగా.. పురందేశ్వరి బలపరిచారు.

## బీఆర్ఎస్ కు షాక్.. కేసీఆర్ కు నోటీసులు..!



హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికల్లో చతికిలపడిన బీఆర్ఎస్ కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ కు నోటీసులు అందాయి. ఆయన సీఎంగా ఉన్న పదేళ్ల సమయంలో విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలకు సంబంధించి నోటీసులు అందాయి. "విద్యుత్ కొనుగోళ్లలో మీ పాత్ర ఏమిటి" నోటీసుల్లో పవర్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. 2024, జూన్ 30వ తేదీ లోపు సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పవర్ కమిషన్ పేర్కొంది. పవర్ కమిషన్ నోటీసులపై కేసీఆర్ బృందం స్పందించిట్లు తెలిసింది. జూలై 30వ తేదీలోపు సమాధానం ఇవ్వటానికి సమయం కావాలని కేసీఆర్ కోరినట్లు కమిషన్ తెలిపింది. అయితే జూన్ 30వ తేదీలోపు సమాధానం చెప్పాలని కమిషన్ స్పష్టం చేసినట్లు సమాచారం. కేసీఆర్ ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని కమిషన్ స్పష్టం చేసింది. జూన్ 30వ తేదీలోపు లిఖితపూర్వక సమాధానం ఇవ్వాల్సిందేనని పవర్ కమిషన్ స్పష్టం చేసింది. భద్రాద్రి, యాదాద్రి, ఛత్తీస్ ఘడ్ విద్యుత్ ఒప్పందాలపై అప్పటి సీఎంగా కేసీఆర్ పాత్రపై ఉన్న అనుమానాలు, లోగుట్టుపై ఉన్న సందేహాలకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంటుందని కమిషన్ పేర్కొంది. బీఆర్ఎస్ అధినేతకు నోటీసులు రావడంతో కింది స్థాయి శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే కవిత జైలులో ఉన్నారు. రాన్ ట్యాపింగ్ విచారణ సాగుతోంది. తాజాగా కేసీఆర్ కు నోటీసులు జారీ చేయడంతో ఏంస్ట్రంలో ఫో జరుగుతుందోనని ఆందోళనగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి కూడా బీఆర్ఎస్ పెద్ద సమస్య ఏర్పడే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ వీడేందుకు పలువురు ఎమ్మెల్యేలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది కాంగ్రెస్ తో టచ్ లోకి వెళ్లగా.. కొంత మంది బీజేపీతో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒక్కరిద్దరు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

## సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు శుభవార్త

హైదరాబాద్ : సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారసుల గరిష్ఠ వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40కి పెంచుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని 2018 మార్చి 9వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది.

# బాబు నుంచి ఏపీ ఏమి ఆశిస్తోంది ?

మొదటి పేజి తరువాయి




టీడీపీ ఆవిర్భవించాక ఇంతటి విజయాన్ని దక్కించుకోలేదు. దీని మీదనే ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ఎన్నిక అయ్యాక చంద్రబాబు మాట్లాడుతూ అన్నారు. ఇది 93 శాతం స్ట్రైకింగ్ రేట్ అని ఆయన అభివర్ణించారు. ఏపీ ప్రజలు పవిత్రమైన బాధ్యతను కూటమి మీద ఉంచారు అని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే అమరావతినే రాజధానిగా ఆయన ఎన్డీయే సమావేశంలో ప్రకటించారు. ఇది ఆయన కరెక్ట్ గానే ప్రజల నాడిని అంచనా వేసి చెప్పారనుకోవాలి. ఏపీలో అభివృద్ధి లేదు అన్నది జనంలో ఉన్న భావన. కనీసం చెప్పుకునేందుకు రాజధాని కూడా లేదు అని కూడా అయిదు కోట్ల జనం తీవ్ర ఆవేదన చెందారు. అలా వారి ఆవేదన అసంతృప్తి ఒక కచ్చితమైన తీర్పు రూపంలో బయటకు వచ్చింది. చాలా సేపు ఎన్డీయే సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు ఎక్కువగా అభివృద్ధి గురించే ప్రస్తావించడం గమనార్హం. ఆయన విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కర్నూల్ ని ఏ మాత్రం తక్కువ కాకుండా అభివృద్ధి చేస్తామని కూడా పేర్కొన్నారు. ఈ విధంగా మూడు ప్రాంతాలలో సమగ్రాభివృద్ధి టీడీపీ కూటమి లక్ష్యమని కూడా ఆయన స్పష్టంగానే చెప్పారు. అదే సమయంలో సంక్షేమం గురించి బాబు పెద్దగా మాట్లాడలేదని చర్చ సాగుతోంది. కూటమి సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలను ఇచ్చింది. వైసీపీ కంటే రెట్టింపు పథకాలు అని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ప్రచారం చేశారు. అయితే దాని మీద మాత్రం ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా బాబు ఎక్కువగా మాట్లాడలేదు అని అంటున్నారు. పైగా బాబు చాలా ఆసక్తికరమైన అంశాలనే చెప్పారు. ఏపీలో ఎంత అప్పు ఉంది అన్నది తెలియదు అన్నారు. దిగేదాకా లోతు తెలియదని అందువల్ల మొత్తం స్టడీ చేయాలన్నది బాబు మాటల వెనక ఉన్న అర్థంగా భావించాలి. ఏపీలో అప్పుల కుప్పగా అంతా ఉందని బాబు చెప్పుకొచ్చారు. ఏపీలో అన్ని వ్యవస్థలు శిధిలం అయ్యాయని మొత్తం మీద చూస్తే మొదటి నుంచి పని ప్రారంభించుకోవాలని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ భారీ కృషిలో తనకు అంతా సహకరించాలని ఆయన కోరారు. ఒక విధంగా చెప్పలంటే బాబు ముందు అభివృద్ధి సంక్షేమం రెండూ ఉన్నాయి. అసంతృప్తి చాలానే మరీ ముఖ్యంగా బాబుని ప్రజలు ఎన్నుకుంది అభివృద్ధి కోసం అని కూడా అంటున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం, అమరావతి రాజధాని పరిపూర్తి చేయడం వంటివి రానున్న అయిదేళ్లలో బాబు చేస్తే ఆయనకు తిరుగు ఉండదని కూడా అంటున్నారు. ఇక సంక్షేమ పథకాల విషయంలో చూస్తే ఎన్నో అమలు చేసిన జగన్ ని అయిదేళ్ళ తరువాత జనాలు ఓడగొట్టారు అంటే వాటి గురించి కూడా నిశిత పరిశీలన చేయాల్సి ఉంది అని అంటున్నారు. ఆపన్నులకు అణగారిన వర్గాలకు సంక్షేమం తప్పనిసరి అదే టైం లో దూబారా చేసి పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేయాలనుకోవడం మంచింది కాదు అన్న సూచనలు వస్తున్నాయి. జగన్ సంక్షేమ పథకాలు చాలా వరకూ అనర్హులకు కూడా వెళ్లాయని చెబుతున్నారు. ఎవరినీ కాదనకుండా అందరికీ పథకాలు ఇవ్వడం వల్ల రాష్ట్రం అప్పుల కుప్ప అయింది అని అంటున్నారు. చంద్రబాబు అలా కాకుండా అర్హులను కచ్చితంగా ఎంపిక చేసి అవసరం ఉన్న వారికే పథకాలు ఇవ్వడం మంచిది అని అంటున్నారు. అంతే తప్ప అప్పులు తెచ్చి పథకాలు ఇవ్వాల్సింది లేదు అన్న వాదన కూడా ఉంది. మొత్తం మీద చూస్తే అటు అభివృద్ధి ఇటు సంక్షేమం విషయంలో కొత్త ప్రభుత్వం బ్యాలెన్స్ తో వెళ్తేనే ఏపీ ప్రగతి బాటన సాగుతుంది అని అంటున్నారు.

# కేంద్ర మంత్రులకు శాఖల కేటాయింపు

మొదటి పేజి తరువాయి

ఆవాస్ యోజన పథకం కింద గ్రామీణ, పట్టణాల్లో 3కోట్ల గృహాలు నిర్మించేలా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఇక కేంద్ర మంత్రులకు కేటాయించిన శాఖలు ఇలా ఉన్నాయి

అమిత్ షా : కేంద్ర హోం శాఖ,,నిర్మల సీతారామన్ : ఆర్థిక శాఖ,,జయశంకర్ - విదేశాంగ శాఖ,,రాజ్ నాథ్ సింగ్ :రక్షణ శాఖ,,మనోహర్ లాల్ కట్టర్ : పట్టణ అభివృద్ధి శాఖ,,శివరాజ్ సింగ్ చౌహన్ : వ్యవసాయ శాఖ మంత్రి , పంచాయతీరాజ్ శాఖ,సీఆర్ పాటిల్ : జలశక్తి,పీయూష్ గోయల్ : వాణిజ్య శాఖ మంత్రి,అశ్విని వైష్ణవ్ : సమాచార శాఖ మంత్రి,,,ధర్మేంద్ర ప్రధాన్ : మానవ వనరులు అభివృద్ధి శాఖ,,గజేంద్ర సింగ్ శేకావత్ : టూరిజం, సాంస్కృతిక శాఖ,,జేపీ నడ్డా : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి,జితిన్ రాం మాంజీ : సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి,అన్నపూర్ణ దేవి : మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి,భూపేంద్ర యాదవ్ : అటవీ, పర్యావరణ శాఖ,,కిరణ్ రిజిజు : పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి,చిరాగ్ పాశ్వాన్: క్రీడా శాఖ మంత్రి,కుమారస్వామి : భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి,సర్బానంద్ సోనోవాల్ : షిప్పింగ్ శాఖ మంత్రి,జ్యోతి ఆదిత్య సింధియా: టెలికాం, ఈశాన్య రాష్ట్రాల శాఖ,ప్రహ్లాద జోషి : రెన్యూవబుల్ ఎనర్జీ,,రవణీత్ సింగ్ బిట్టు : మైనార్టీ శాఖ సహాయ మంత్రి,హర్ష మల్హోత్ర - రోడ్లు జాతీయ రహదారుల శాఖ సహాయ మంత్రి,సురేష్ గోపి : టూరిజం సహాయ శాఖ మంత్రి,తెలుగు రాష్ట్రాల కేంద్ర మంత్రులకు కేటాయించిన శాఖలు ఇవే,కిషన్ రెడ్డి : కేంద్ర గనుల శాఖ మంత్రి,బండి సంజయ్ : హోంశాఖ సహాయ మంత్రి,రామ్మోహన్ నాయుడు : కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి,శ్రీనివాస్ వర్మ : ఉక్కు, భారీ పరిశ్రమలు శాఖ సహాయ మంత్రి,పెమ్మసాని చంద్రశేఖర్ : గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి,కేంద్ర మంత్రులు వీరే.. ఇక్కడ క్లిక్ చేయండి,. అయితే ఈ మంత్రి వర్గం సమావేశం లోపే నేతలకు శాఖలు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రులకు ఎవరికి ఏయే శాఖ కేటాయిస్తారని అంశంపై ఉత్కంఠ కొనసాగుతుండగా..సీనియర్ మంత్రులను అదే శాఖల్లో కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆదివారం కొలువుదీరిన మోదీ 3.0 కేబినెట్‌లో ఆరుగురు మాజీ ముఖ్యమంత్రులు చేరారు. వారికి కీలక శాఖలు అప్పగించే యోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. హోం,రక్షణ శాఖ, ఆర్థిక శాఖ వంటి కీలక పదవులు బీజేపీ నేతలకేననే ప్రచారమూ కొనసాగుతుంది.

### ప్రాధన్యాత కలిగిన శాఖపై కిషన్ రెడ్డి పట్టు

మరోవైపు తెలుగు రాష్ట్రాలకు ఏ శాఖలు దక్కుతున్నాయనే అంశంపై ఆసక్తికర చర్చ మొదలైంది. ఏపీ, తెలంగాణలకు రెండు కేబినెట్, మూడు సహాయమంత్రి పదవులు దక్కనున్నాయి. అయితే తెలంగాణ నుంచి గతంలో కిషన్ రెడ్డికి ప్రధాని మోదీ టూరిజం శాఖ అప్పగించాగా.. ఈ సారి మాత్రం ఈసారి ప్రాధాన్యత కలిగిన శాఖను కిషన్ రెడ్డి ఆశిస్తున్నారు.

### పార్లమెంట్ సమావేశాలపైనా

ఇక క్యాబినెట్ సమావేశంలో పార్లమెంటు సమావేశాల తేదీని ఖరారు చేసే అవకాశం ఉంది. ఈనెల 15 నుంచి 22 వరకు పార్లమెంట్ సమావేశాలను నడిపేందుకు ప్రణాళిక సిద్ధం కానుందని, 15 నుంచి మూడు రోజులపాటు ఎంపీల ప్రమాణస్వీకారం, ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక ఉండనుంది. అనంతరం ఈనెల 22న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు.

## తెలంగాణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని న్యాయం చేస్తా...

అమరావతి: తెలంగాణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని తాను ఆ ప్రాంతానికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని కేంద్రమంత్రి, టీడీపీ నేత రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ఎంపీలు, కేంద్రమంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రి... ఇలా ఎవరి నుంచి తనకు విజ్ఞప్తులు వచ్చినా మరో ఆలోచన లేకుండా ఆ ప్రాంతానికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. తన సహకారంతో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారని... ఇది తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. 'ఆ అనుబంధం (ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య) ఎప్పుడూ కొనసాగించాలి. సివిల్ ఏవియేషన్స్ మంత్రిత్వ శాఖ ద్వారా మా తెలంగాణ ప్రజలకు కూడా నేను చేరువయ్యే అవకాశం దక్కింది. తెలంగాణపై కూడా దృష్టి పెడతాను. అక్కడ (తెలంగాణ) ఉన్నటువంటి సమస్యలు నా దృష్టికి వస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తాను. తెలంగాణ ప్రాంతానికి కూడా న్యాయం చేసే ప్రయత్నం చేస్తా'నని కేంద్రమంత్రి అన్నారు.పార్లమెంట్‌లో నేను మాట్లాడింది ఏపీ ప్రజలూ విన్నారు గతంలో పార్లమెంట్‌లో తాను మాట్లాడుతూ, 'రెండు నిమిషాలు టైమివ్వండి... భవిష్యత్తులో ఎంతమంది ఎంపీలు కావాలో తీసుకువస్తాను' అని చెప్పానని... నాటి తన మాటలను స్పీకర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలు విన్నారని వ్యాఖ్యానించారు. అందుకే నాడు ముగ్గురు ఎంపీల నుంచి ఈ రోజు 21 మంది ఎన్డీయే ఎంపీలను గెలిపించారన్నారు. అందుకే ఏపీ ప్రజలకు తాను థ్యాంక్స్ చెబుతున్నానన్నారు.

# అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని

మొదటి పేజి తరువాయి

ఇకపై మూడు రాజధానులు అంటూ ఆటలాడే పరిస్థితి రాష్ట్రంలో ఉండదని తేల్చి చెప్పారు. విశాఖపట్నంను ఆర్థిక, ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. కూటమి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నందుకు ఆయన ధన్యవాదాలు చెబుతూ ప్రజా తీర్పును గౌరవించి, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తామందరిపైనా ఉందన్నారు.

గత పాలనలోనే పోలవరం దాదాపుగా పూర్తి..

సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం ఎంతో అవసరమని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని వివరించారు. నిజానికి 2014లో అధికారంలోకి వచ్చి ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించినపుడే పోలవరం ప్రాజెక్టు పనులను 72 శాతం పూర్తిచేశామని చంద్రబాబు చెప్పారు. వరదలకు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని చెబుతూ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఎకరానికీ నీళ్లందిస్తామని హామీ ఇచ్చారు.

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం శిథిలమైంది..

గత ప్రభుత్వ హయంలో ఐదేళ్లలోనే రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని చంద్రబాబు ఆరోపించారు. రాష్ట్రం సమస్యల సుడిగుండంలో చిక్కుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు దెబ్బతిన్నాయని, రైతులు అప్పుల పాలయ్యారని చెప్పారు. సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను చక్కదిద్దే పని ప్రారంభిస్తామని వివరించారు. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళతామని చెప్పారు. 'సీఎం పదవి హోదా కోసమే తప్ప పెత్తనం కోసం కాదు. సీఎం కూడా మామూలు మనిషే.. అలాగే మీ ముందుకు వస్తా. మిత్రుడు పవన్ కల్యాణ్ తో పాటు మేమంతా సామాన్యులుగానే ప్రజల వద్దకు వస్తాం' అని చెప్పారు.

ప్రతి అడుగూ ప్రజాహితమే..

సీఎం పర్యటనల సందర్భంగా షాపులు, రోడ్లు మూసివేయడం, పరదాలు కట్టడం లాంటివి ఇకపై రాష్ట్రంలో కనిపించబోవని చెప్పారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలను ఆపేయడం జరగదన్నారు. 'ఐదు నిమిషాలు నాకు లేటైనా పర్వాలేదు కానీ ప్రజలకు అసౌకర్యం కలగవద్దు' అని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదని, ప్రతీ నిర్ణయం, ప్రతీ అడుగు ప్రజాహితం కోసమే ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

తప్పు చేసినవారిని వదిలిపెట్టబోనని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. "తప్పు చేసినవాడిని క్షమించి, పూర్తిగా వదిలిపెడితే అది అలవాటుగా మారుతుంది. తప్పు చేసినవాళ్లకు చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో విధ్వంస, కక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలి. పదవి వచ్చిందని విర్రవీగొద్దు. వినయంగా ఉండాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇంకా చంద్రబాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా తాను బుధవారం నాలుగోసారి ప్రమాణం చేయబోతున్నానని.. రేపటి ప్రమాణానికి ఉన్న ప్రాధాన్యత వేరని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో మనపై బాధ్యత పెరిగిందన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ వచ్చి పరామర్శించడమే కాకుండా, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని చెప్పారని బాబు గుర్తు చేశారు. జనసేన, బీజేపీతో పొత్తు కలిసొచ్చిందన్నారు. ఇక పవన్, తాను కలిసి జిల్లా పర్యటన చేశామన్నారు. అటు బీజేపీ అగ్రనేతలు కూడా రాష్ట్రంలో పర్యటించారని, విజయవాడలో కూటమి రోడ్ షోను మోదీ అభినందించారని గుర్తుచేశారు. తాను ఎప్పుడూ రాగద్వేషాలకు అతీతంగా పనిచేశానని పేర్కొన్నారు. తనకు ప్రజాహితమే తెలుసన్నారు.

## ఉద్యోగుల సమయపాలన పై ఫోకస్

మొదటి పేజి తరువాయి

ఇప్పటికే రుణమాఫీ అమలు చేయడానికి పక్క ప్రణాళికతో అధికారులు సిద్ధం అవ్వాలని, ఆగస్టు 15వ తేదీన ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ చేసి తీరాలని ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి మరో సంచలననిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. ఉద్యోగుల సమయపాలన విషయంలో రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగుల సమయపాలన పై ఫోకస్ చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ కార్యాలయాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే మొదటగా సెక్రటేరియట్ నుండే దానికి శ్రీకారం చుట్టాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసులకు లేటుగా వచ్చి త్వరగా ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఉద్యోగుల సమయపాలన విషయంలో రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తుంది. సెక్రటేరియట్ నుండి బయోమెట్రిక్ విధానాన్ని తీసుకు రావాలని ఆలోచన బయోమెట్రిక్ విధానం అమలులోకి వస్తే ఉద్యోగులు కూడా టైమింగ్ పాటిస్తారని అందరికీ అందుబాటులో ఉండి పని పైన ఫోకస్ చేస్తారని రేవంత్ భావిస్తున్నారు.దీని వలన పనులలో వేగం పెరగడం కారణంగా రాష్ట్రంలో సమస్యలు తొందరగా పరిష్కారం అవుతాయని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సెక్రటేరియట్ నుండి బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని రేవంత్ అనుకున్నట్టు సమాచారం. సెక్రటేరియట్ తర్వాత జిల్లాలలో బయో మెట్రిక్ విధానం ముఖ్యమంత్రి, మంత్రులు, సిఎస్, సెక్రటరీల నుంచి అటెండర్ వరకు ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ విధానంలో తమ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేసేలా నిర్ణయం తీసు కుంటున్నట్టు తెలుస్తోంది. మొదట సచివాల యంలో ఈ విధానాన్ని అమలు చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ విస్తరించాలని ప్రభుత్వం భావిస్తుందని చర్చ జరుగుతోంది.

రేవంత్ ఆలోచన కార్య రూపం దాలుస్తుందా?

అయితే ఈ విధానం నామమాత్రంగా ఉద్యోగా లను చేసే ప్రభుత్వ ఉద్యోగులకు నిజంగా షాక్ అనే చెప్పాలి. ఇక ఈ విధానాన్ని వ్యతిరేకించే వారు, అంగీకరించే అధికారులు ఎందరు ఉంటారో మరి. విమర్శలు ఎదురైనా సరే ఇది చేసి తీరాలని రేవంత్ భావిస్తున్న క్రమంలో మరి రేవంత్ రెడ్డి ఆలోచన కార్యరూపం దాలుస్తుందా లేదా అన్నది భవిష్యత్తులో తేలనుంది.

## మోదీ 3.0.. స్పీకర్? పదవిలో కూర్చునేదెవరు?

మొదటి పేజి తరువాయి

30 మందికి క్యాబినెట్ మంత్రులుగా అవకాశం లభించింది. మరో ఐదుగురిని స్వతంత్ర హోదాతో సహాయ మంత్రులుగా, 36 మందిని సహాయ మంత్రులుగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కొత్తగా ఏర్పాటైన నరేంద్ర మోదీ క్యాబినెట్ తొలి సమావేశం సోమవారం జరగనునంది. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసంలో క్యాబినెట్ సమావేశం ఉంటుంది. కాగా ఇటీవల వెలువడిన లోక్?షభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడంతో మిత్ర పక్షాలైన టీడీపీ, నితీష్? కుమార్? నేతృత్వంలోని జేడీయూతో కలిసి మూడోసారి ప్రధానిగా పదవీ స్వీకరించారు మోదీ. ఫలితాలు వెలువడిన నాలుగు రోజులకే మోదీతో సహా 72 మంది మంత్రులతో కూడిన పూర్తిస్థాయి మంత్రివర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. కీలక మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూలకు రెండు మంత్రి పదవులు (ఒక కేబినెట్? ర్యాంకు, ఒక రాష్ట్ర మంత్రి) దక్కాయి. అయితే మరో కీలక పదవి అయిన లోక్?సభ స్పీకర్? ఎవరికి దక్కుతుందే ప్రశ్న ఇంకా ఉత్కంఠగానే మిగిలి ఉంది. ఈ ఎన్నికల్లో కింగ్‌మేకర్‌గా అవతరించిన టీడీపీ, జేడీయూలు ఈ పోస్టుపై కన్నేసినప్పటికీ.. దానిని వదులుకునేందుకు బీజేపీ ఆసక్తి చూపడం లేదు. అయితే రాజ్యాంగం ప్రకారం, కొత్తగా ఎన్నికైన లోక్‌సభ మొదటిసారి సమావేశమయ్యే ముందు స్పీకర్ పదవి ఖాళీ అవుతుంది. హౌస్‌లోని సీనియర్ సభ్యుల నుంచి రాష్ట్రపతి .. ఒకరిని ప్రొటెం స్పీకర్?గా నిమిస్తారు. ఈ ప్రొటెం స్పీకర్ కొత్త ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అనంతరం సాధారణ మెజారిటీతో హౌస్ సభ్యుల నుంచి ఒకరిని స్పీకర్?గా ఎన్నుకుంటారు. లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికవ్వడానికి నిర్దిష్ట ప్రమాణాలు, ప్రత్యేక నియమాలేవి లేకపోయినా... రాజ్యాంగం, పార్లమెంటరీ నియమాలపై అవగాహన కలిగి ఉండటం అవసంరం. గత రెండు పర్యాయాలలో లోక్?షభలో బీజేపీకి మెజారిటీ ఉండటంతో సుమిత్రా మహాజన్, ఓం బిర్లా స్పీకర్‌లుగా ఎన్నికయ్యారు. కాగా లోక్?సభ స్పీకర్? పదవనేది కీలక పదవి. ఫిరాయింపు కారణంగా సభ్యులపై అనర్హత వేటు వేయడానికి సంబంధించిన కేసులను నిర్ణయించడంలో ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం స్పీకర్‌కు సంపూర్ణ అధికారం ఉంటుంది. గత కొన్ని సంవత్సరాల్లో ఇలాంటి ఘటనలు కూడా జరిగాయి. పార్టీలో తిరుగుబాటు చేయడం ద్వారా పార్టీ చీలికలకు దారి తీసి ప్రభుత్వాన్నే పడగొట్టిన సందర్భాలు ఉన్నాయి. అందుకే ఇలాంటి వాటికి చోటివ్వకుండా ఉండేందుకు టీడీపీ, జేడీయూ ఈ పదవిని కోరుకుంటోంది.

# జైల్లో చంద్రబాబు నలిగిపోయారు: పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి

కూటమి తరఫున గెలుపొందిన ఎమ్మెల్యేలంతా ఈ సమావేశానికి హాజరై చంద్రబాబును ఎన్డీఏ కూటమి శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి అభ్యర్థిగా పవన్ ప్రతిపాదించగా...ఆ తీర్మానాన్ని కూటమి నేతలు ఏకగ్రీవంగా అంగీకరించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు పంపనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కూటమికి గవర్నర్ ఆహ్వానం పలకనున్నారు. తనను ఎన్డీఏ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టీడీపీ అధినేత ధన్యవాదాలు తెలిపారు. ఈ సమాశానికి టీడీపీ అధినేత చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు గురించి పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబును పక్కనపెట్టుకొని తాను ఒక మాట చెప్పాలని, జైల్లో ఉన్నపుడు ఆయన చాలా నలిగిపోయారని, తాను చూశానని ఎమోషనల్ అయ్యారు. భువనేశ్వరిగారి బాధను చూశాను, అమ్మా మీరు కన్నీళ్లు పెట్టకండి, మంచి రోజులు వస్తాయని ఆ రోజు జైల్లో చెప్పానని, తాను అన్నట్లే మంచి రోజులు వచ్చాయని పవన్ చెప్పారు. మనస్ఫూర్తిగా చంద్రబాబు గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి సుపరిపాలన కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని, ఆ సుపరిపాలనను చంద్రబాబు అందజేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అభివృద్ధిని సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పవన్ అన్నారు. కూటమి విజయం యావత్ దేశానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. కూటమి అంటే ఎలా ఉండాలి, కలసికట్టుగా ఎలా ఉండాలి అని చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు కూటమి మంచి పాలన అందిస్తుందని నమ్మకం పెట్టుకున్నారని, కాబట్టి కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదని సూచించారు.

# తెలుగుదేశం పార్టీ సస్పెండ్ కు కారణాలు తెలపండి గాడిపర్తి రామకృష్ణ

నందిగామ (గౌతమ్ న్యూస్ ): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఎన్ డి ఏ కుటమీ ఘన విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, లోకేష్ బాబు నాయకత్వాన్ని, పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని, ఈ రాష్ట్ర ప్రజలు, అద్భుత అద్భుతమైన విజయాన్ని అందించినందుకు, చాలా గర్వించదగ్గ విషయం, దానిలో భాగంగా, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా, నేను గాడిపర్తి రామకృష్ణ చాలా సంతోషంగా గర్వస్తున్నాను రాష్ట్రంలో 175 నియోజకవర్గాలుగాను 164 నియోజవర్గాలలో విజయం సాధించిన ఎన్ డి ఏ కూటమి అభ్యర్థులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య విజయం అత్యధికమైన మెజారిటీతో గెలుపొందిన తంగిరాల సౌమ్య ధన్యవాదాలు. రాష్ట్రంలో2019 నుండి 2024 వరకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులపై దాడులు అరాచకాలు కేసులు ఇది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. అదేవిధంగా నందిగామ నియోజకవర్గంలో అనేక వేధింపులకు గురైన గాడిపర్తి రామకృష్ణ అనే నేను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా నందిగామ నియోజకవర్గంలో మొట్టమొదటగా ఫైర్ నో 330/2019 కే సుబనాయించడం జరిగింది ఈ కేసులో నా వాహనం కూడా సీజ్ చేయటం జరిగింది, ఆ తరువాత నందిగామ నియోజకవర్గంలో తంగిరాల సౌమ్య ప్రజా పోరాటంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా నేను కూడా పాల్గొంటూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేశాను, తెలుగుదేశం పార్టీ చేసిన పోరాటంలో 2023 తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 09.9.2023 అరెస్టును నిరసిస్తూ ఓ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడిగా అనేక పోరాటాలు చేసిన నేను ఆయన అరెస్టు చాలా ఖండిస్తూ బాధకు గురై నాను అనేక కష్టాలు పడి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడి గా పోరాటాలు చేసినందుకు నేను గర్వపడుతున్నాను. ఇంత చేసిన గాడి పార్టీ రామకృష్ణ అనే నన్ను తెలుగుదేశం పార్టీకి కాకుండా ఇతర పార్టీలకు సపోర్ట్ చేశానని,అనేక రకమైనటువంటి నిరాధారమైన ఆరోపణలను చేసి, కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో నా ఎదుగుదలను ఓర్వలేక నాపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు కొంతమంది శ్రీమతి తంగిరాల సౌమ్య (ఎమ్మెల్యే ) నాపై నిరాధారమైన ఆరోపణలు చేసి నన్ను తెలుగుదేశం పార్టీ కుటుంబంలో నుండి 09-06-2024 నన్ను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల్లో నుండి పార్టీలో నుండి నన్ను సస్పెండ్ చేయడం నన్ను చాలా బాధించింది, రాష్ట్రంలో ఎన్ డి ఏ, కూటమికి ప్రజలు, తిరుగులేని తీర్పునిచ్చినట్టే నందిగామ నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీతో ఎన్ డి ఏ కూటమి అభ్యర్థిని గెలిపించుకునే భాగంలో నా కష్టమ్ కూడా ఉన్నందున, నన్ను ఎందుకు పార్టీ నుండి సస్పెండ్ చేసినారో,అలానే టీఎన్ఎస్ అధ్యక్షుడు ఈ వురి వినోద్ ని కూడా (టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎన్టీఆర్ జిల్లా ) ని కూడా సస్పెండ్ చేయగా మాపై నిరాధారమైన ఆరోపణలు చేసి సరైన వివరణ ఇవ్వకుండా, తెలుగుదేశం పార్టీలో నుండి సస్పెండ్ చేసినందుకు గాను, బాధాతత్వ హృదయంతో

ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి, ఈరోజు వరకు తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి నన్ను, ఎందుకు సస్పెండ్ చేశారో వివరణ ఇవ్వవలసిందిగా అడుగుతూ, నాపై సస్పెన్షన్ను ఎత్తివేయాలని కోరుతూ, లేనియెడల మీరు తీసుకున్న ఈ రకమైనటువంటి నిర్ణయానికి, జిల్లాస్థాయి నాయకుల నుండి, రాష్ట్రస్థాయి నాయకుల వరకు, నా గోడును వినిపించి నా సమస్యకు పరిష్కారాన్ని పొందుతానని, తెలియజేసిన, గాడిపత్రి రామకృష్ణ

## ప్రతి దైవజనుడు దేవుని పోలి నడుచుకొనవలెను



నందిగామ (గౌతమ్ న్యూస్ ): నందిగామ మండలం రుద్రవరం గ్రామంలో స్థానిక దైవజనులు రత్నం గారి చర్చి నందు ఏటి పట్టి 10 గ్రామాల సేవకుల ప్రత్యేక కుడిక జరిగింది ఈ సదస్సులో వర్తమానికులుగా సునీల్ మాట్లాడుతూ పరిశుద్ధ బైబిల్ గ్రంధంలో దేవుని భక్తులు ఏ విధముగా వారు జీవించారో ఆ విధంగా మాదిరిగా ప్రతి దైవజనుడు శ్రేష్టమైన బుద్ధి కలిగి ప్రార్ధనలు చేస్తూ. నింద లేని వారిగా యధార్థవంతులుగా 'ప్రార్థన యందును దేవుని స్తుతులు అర్పిస్తూ 'సమాజం పట్ల సంఘం పట్ల ప్రేమ కలిగి జీవిస్తూ మాదిరి కరముగా జీవించాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలోని ఏటి పట్టి గ్రామాల ఫెలోషిప్ ప్రెసిడెంట్ కోట మోషే. సెక్రటరీ కే.మెసేక్ ట్రెజరర్ స్వామి వైస్ ప్రెసిడెంట్ రమేష్ స్థానిక సేవకులు రత్నం ఇనుప నూరి రాజు. ఆనంద్.జగదీష్.ప్రసంగి. ఇస్సాకు అబ్రహాము.యేసు రాజు.శాంతి రాజు దైవజనులు పాల్గొన్నారు..

## నందిగామ ప్రభుత్వ హాస్పటల్ లో పట్టించుకొని డాక్టర్స్




నందిగామ(గౌతమ్ న్యూస్ ): లో యువతి పాముకాటుకు గురి అయి ప్రభుత్వా హాస్పిటల్ కు చేరిక. కనీసం డ్యూటీ చేస్తున్న డాక్టర్స్ చూడకుండా నర్సులతో ట్రీట్మెంట్ చేయిస్తున్న డ్యూటీ డాక్టర్స్. ఇది ఇలాగే కొనసాగితే ఈ విధానం ప్రభుత్వానిదా? లేక వేలకు వెలు ప్రజా ధనాన్నీ జేతాలు గా తీసుకుంటున్న అధికరులదా? పేద ప్రజల అనా రోగ్యనికి గురై హాస్పిటల్ కు వస్తే డాక్టర్స్ అందు బాటులో వున్నా లేకున్నా నర్సులే వైద్యం అందిస్తున్న వైనం.ప్రమాదం అంచున రోగులు, ఇకనైనా డాక్టర్స్ అందుబాటులో ఉండి సరయిన వైద్యం అంది స్తారుఅని ప్రజలు కొరు కొంటునారు.

## ఐఎఫ్ టీ యూ టేకులపల్లి ఏరియా 4వ మహాసభను జయప్రదం చేయండి



టేకులపల్లి(గౌతమ్ న్యూస్ ): భారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టూ టేకులపల్లి ఏరియా మహాసభ .ది.(14/06/2024) శుక్రవారం రోజున టేకులపల్లిలో. జరుగును కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ. ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్. ఐ ఎఫ్ టీ యూ రాష్ట్రకార్యదర్శిపాయం వెంకన్న కార్యదర్శి.ఐ ఎఫ్ టీ యూ జిల్లా నాయకులు జరుపుల సుందర్ మాట్లాడుతూ.ఐ ఎఫ్ టీ యూ ఈ ప్రాంతంలో సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతుంది వారి తరఫున నిజాయితీగా పనిచేస్తున్నది ఈ కార్మికుల వేతనాలు సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నది అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల పై జరిగిన పోరాటంలో ముందు భాగాన నిలిచింది సింగరేణి హమాలి ఆటో మోటార్స్ వర్కర్ల గ్రామపంచాయతీ మధ్యాహ్న బోధ నం ఆశ వర్కర్ల అంగన్వాడి తదితర రంగాల కార్మికుల తరఫున నిరంత రం పోరాడు తున్నది. ఈ క్రమంలోనే టేకులపల్లి ఏరియా ఐఎఫ్ టీ యూ 4వ. మహాసభను మరింత బలోపేతం చేయడం కోసం టేకులపల్లి ఏరియా నిర్మాణ మహాసభను జరుపుకుంటున్నది కావున ఈ మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో.సి ఎచ్ . వెంకటేశ్వర్లు. ధనసరి భద్రం. కల్తీ వీరస్వామి. సైదులు. అన్వేష్. ప్రశాంత్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి డిపెండెంట్ ల వయసు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంపు

### సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం

### హర్షం వ్యక్తం చెసిన ఏఐటియుసి కెఓసి ఫిట్ మీటింగ్ లొ నాయకులు




టేకులపల్లి (గౌతమ్ న్యూస్ ): ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యునీయన్ ఆద్వర్యంలో కొయగూడెం ఓసిపి లొ ఉదయం షిఫ్ట్ నందు ఫిట్ మీటింగ్ నిర్వహించారు ఈ సమావేశంలో బ్రాంచ్ సహయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి లో గతంలో డిపెండెంట్ ఉద్యోగం కోసం వయసు 35 సంవత్సరాలు ఉండే , ఏఐటియుసి ఇట్టి వయసు 40 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ యాజమాన్యం కు గత మూడు నెలల క్రితం గుర్తింపు సంఘం గా విజ్ఞప్తి చేయడం జరిగింది. గతంలో ఇట్టి డిమాండ్ ను యాజమాన్యం ఒప్పుకోవడం జరిగింది. కానీ ఎన్నికల కోడ్ వలన ఇన్ని రోజులు ఆలస్యం జరిగింది. దానిని అమలు చేసేందుకు యాజమాన్యం 40 సంవత్సరాలు డిపెండెంట్ ఉద్యోగం కోసం వయసు పెంపుదల చేసినట్లు గా సర్కులర్ 10-06-2024న జారీ చేసింది. అందుకు వారు హర్షం వ్యక్తం చేశారు కావున కార్మిక సోదరులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కృషి ని గమనించగలరని వారు కొరారు వయస్సు పెంపుదల విషయంలో వర్కర్స్ యునియన్ గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం శాషసబ్యులు కూనంనేని సాంబశివరావు గారు ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య , జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ లకు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ కృష్ణ, ఫిట్ సహయ కార్యదర్శులు బానోత్ బాలాజీ, షెక్ సర్వర్, వర్క్మెన్ ఇన్స్పెక్టర్ జీఎ శ్రీనివాస్, సామల శ్రీనివాస్, వేంకపనరస్య, వేంగల రవి, కాలేపుల్లయ్య, బండి సీతారాములు, రామకృష్ణ చారి,తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ (ఎం.ఎల్) ప్రతిఘటన ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ రాధక్క అలియాస్ నిర్మలక్కకు జోహార్లు

టేకులపల్లి (గౌతమ్ న్యూస్ ): ప్రముఖ ప్రతిఘటనోద్యమ, విప్లవోద్యమ నాయకురాలు, కామ్రేడ్ రాధక్క అలియాస్ నిర్మల (86) ఈరోజు ఉదయం 9 గంటలకు హైదరాబాదు లో మరణించారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె ఆరు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో సిపిఐ( ఎం.ఎల్) చంద్ర పుల్లారెడ్డి గారి నాయకత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ పనిచేశారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో ఆమె ప్రముఖ పాత్ర వహించారు. కడదాకా పీడిత ప్రజల ఉద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. సుదీర్ఘకాలం అజ్ఞాతవాసంలో గడిపారు. అతివాద మితవాదాలకి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పోరాటం చేశారు .విప్లవోద్యమంలో ఆమె వివిధ బాధ్యతలు వహించారు. ఆమె పైన ఈ ప్రభుత్వం అనేక కుట్ర కేసులు బనాయించింది. సాధారణ కార్యకర్త నుండి కేంద్ర కమిటీ సభ్యురాలు వరకు విప్లవోద్యమంలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. అటవీ ప్రాంతంలో గిరిజనుల మధ్య పనిచేశారు. దున్నే వానికే భూమి కొరకు పనిచేశారు. సుదీర్ఘకాలం అజ్ఞాత జీవితం గడిపారు. విప్లవఉద్యమంలో కొంతకాలం జైలు జీవితం కూడా గడిపారు. కామ్రేడ్ రాధక్క మృతికి సిపిఐ( ఎమ్.ఎల్) న్యూడేమెక్రసి మండల కమిటీ వినమ్రంగా జోహార్లు తెలియజేస్తున్నదు ఈకార్యక్రమంలో భూక్య. హర్జ్యా సిపిఐ ఎం ఎల్ న్యూడేమెక్రసి టేకులపల్లి మండల కార్యదర్శి భూక్య. హర్జ్యా, నోముల భానుచందర్, నర్సింగ్, తోటకూరి. సతీష్ లక్ష్మణ్ తదితరులు నివాళి అర్పించి సంతాపం తెలియజేయడం జరిగింది.

## తెలంగాణ వ్యాప్తంగా ఊర చెరువులను గుర్తించి కబ్జాదారుల నుంచి రక్షించాలి



మల్లపూర్ (గౌతమ్ న్యూస్ ): టిపిసిసి ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 68 వేల చెరువులు గ్రామస్థాయిలలో వందల ఎకరంల సరిహద్దు శిఖములు చెరువు మీద నీటి నిల్వ ప్రాంతం క్రింద భూమితో గొలుసుకట్టు మరియు అలుగుల భూమి కిలోమీటర్ల మేర గత కాకతీయ రాజుల పాలన నుండి 1650 సంవత్సరం నుండి మొదలుకొని స్వాతంత్రం వచ్చిన 1945 నుండి 1972 మధ్య కాలంలో ఉన్న చెరువులు నేడు లేవు కారణం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం లేదా ప్రభుత్వ పరిపాలన వైఫల్యం ప్రతి గ్రామంలో చెరువులు భూదాహం గల వ్యక్తులకు ధరణి మహాలక్ష్మి వరములు అవుతున్నాయి నాడు వంద ఎకరంల చెరువు నేడు 10 ఎకరములు కూడా లేదు చెరువులు కుంటలు కబ్జాకు గురవుతున్న ఆక్రమ గురవుతున్న ఎస్సారెస్ పీ అధికారులకు తాసిల్దారు అధికారులకు కలెక్టర్లను ఎన్నో వినతి పత్రాలు ఇచ్చి చెప్పులు అరిగేలా తిరుగుతున్న పట్టించుకోని అధికారులు కబ్జాదారులకు సపోర్టుగా నిలుస్తూ అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు, సమస్త జీవులకు ఊపిరినిచ్చే చెరువులు కనుమరుగవుతుంటే రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందో తలుచుకుంటేనే భయంగా ఉంది ఇలాంటి పరిస్థితుల్లో మన చెరువులను మనం కాపాడుకొవాలి ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో తెలంగాణ యావత్ చర్లకుంట శిఖాలు హద్దులు ఏర్పాటు చేసి ఎఫ్.టి.ఎల్ హద్దులు ఏర్పాటు చేయాలని లేనియెడల నీటి కొడతలు ఏర్పడే పరిస్థితి ఉంటుంది కాబట్టి కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాదారుల పైన కఠిన చర్యలు తీసుకొని చెరువులను కుంటలను కాపాడాలని అలాగే ప్రతి మండలానికి నలుగు సర్వేలను ఏర్పడి చేసి పకడ్బందీగా సికం భూములు కాపాడాలని టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్ తెలిపారు

## నాన్నకు దాహం తీర్చాడు తాను కనుమరుగయ్యాడు



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్ ): మండుటెండలో ట్రాక్టర్ రోటవేటర్ నడుపుతున్న తన తండ్రి దాహం తీర్చడానికి వాటర్ బాటిల్ తీసుకొని పరిగెత్తి అందించిన బాలుడు అంతలోనే అనంత లోకాలకు చేరాడు



...సరదాగా ట్రాక్టర్ పై కూర్చోగా తండ్రి దున్నుతున్న నుండి రోటివేటర్ లో పడి దుర్మరణం చెందాడు ఈ ఘటన మండలంలోని గోవిందా పూర్ శివారు లైన్ తండాలో చోటుచేసుకుంది ఎస్ఐ రామారావు కథనం ప్రకారం లైన్ తండా గ్రామానికి చెందిన యశోద రాజు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు రాజు ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు రాజు తన బావ ట్రాక్టర్ తీసుకొని సోమవారం ఉదయం లైన్ తండా శివారులోని తన వ్యవసాయ భూమిలో పత్తి విత్తనాలు నాటేందుకు దుక్కిని చదును చేసేందుకు తన చిన్న కుమారుడు బాలు తో కలిసి వెళ్ళాడు బాలు చేలుకలోని చెట్టు నీడలో సేదతీరుతో ఆడుకుంటున్నాడు ట్రాక్టర్ రోటివేటర్ నడుపుతున్న రాజుకు దాహం వేయడంతో అక్కడే ఉన్న తన కుమారుడు బాలును మంచినీళ్లు తీసుకురావాలని కోరాడు దీంతో వాటర్ బాటిల్ తీసుకొని పరుగున వెళ్లిన కుమారుడుని గుండెకు హత్తుకొని మంచినీళ్లు తాగాడు అనంతరం సరదాగా ట్రాక్టర్ పై కూర్చోబెట్టుకొని దుక్కి దున్నుతుండగా బాలు ఒక్కసారి కింద పడడంతో రోటివేటర్ లో చిక్కుకొని శరీర భాగాలు ముక్కలు ముక్కలై అక్కడే మృతి చెందాడు కళ్ళముందే తన కుమారుడు దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసెల రోధించారు బాలు మృతితో బాధిత కుటుంబం శోకసముద్రంలో మునిగింది ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

## హైస్కూల్లో భారీ వృక్షాలు నరికివేత

### నీడ నిచ్చే చెట్లను నరికివేత



అన్నపురెడ్డిపల్లి /చంద్రుగొండ,(గౌతమ్ న్యూస్ ): జూన్11 నీడ కోసం చెట్లను పెంచాలని మెరుగైనా జీవితం గడపాలంటే మొక్కలు నాటాలని ప్రపంచం మొత్తం స్వశ్చంద సంస్థలు, ప్రభుత్వాలు చెబుతుంటే మరో ప్రక్క అని తెలిసిన వారే నీడి నిచ్చే చెట్లను నరుకుతున్నారు. వివరాల్లోకి వెళితే.... భద్రాద్రి కొత్తగూడెం




జిల్లా చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల రెండు దశబ్దాలకు పైగా వయస్సున భారీ వృక్షాలను మంగళవారం నరికేశారు. గ్రామస్తులు చూస్తుండగా నేలమట్టం చేశారు. చెట్ల వేర్లు వల్ల పాఠశాల భవనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే సాకుతో చెట్లను నేలమట్టం చేశారు. కనీసం ఉన్నతాధికారులు, అటవీశాఖ, గ్రామ పంచాయితీ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటుతామననే భరోసా, హమీ ఇవ్వాల్సి ఉంటుంది.అటువంటి అనుమతులు లేకుండానే చెట్లను నరికారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు.

## ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలి

### జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ.






ఏటూరునాగారం(జంగాలపల్లి)(గౌతమ్ న్యూస్ ): ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్: ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ జంగాలపల్లి గ్రామం లో జరిగిన గ్రామ సభ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఈ కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బంది కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలనిగ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామాలలో ప్రత్యేకంగా విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ ను ఏర్పాటుచేసి విద్యార్థుల సంఖ్య గ్రామాలలో ఉండే విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పణిని, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీవో రామకృష్ణ , పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ.



ఏటూరునాగారం(ములుగు)(గౌతమ్ న్యూస్ ): ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల



నమోదు పెంచాలని స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ విద్య శాఖ అధికారి పణిని , డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్ లతో కలిసి జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమం పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ పి .శ్రీజ మాట్లాడుతూ విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని,శక్తి వంచన లేకుండా పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. గ్రామాలలో బడి మానేసే విద్యార్థి సంఖ్య తగ్గించాలని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని తెలిపారు. ఈ సమావేశం లో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, రమాదేవి, మల్లారెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, దివాకర్, సురేందర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, రాజేష్ జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

### మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక



అన్నపురెడ్డిపల్లి (గౌతమ్ న్యూస్ ): విష జ్వరాలు వ్యాపించకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోగల మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - ఎర్రగుంట వైద్యా



అధికారి ప్రియాంక ఈ వర్షాకాల సిజన్ దృష్ట్యా మండలం లోని ఆరోగ్య సిబ్బంది చేస్తున్న డ్రేడే కార్యక్రమాన్ని సందర్శించి. మండల ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వారు ప్రజలతో మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి అని తెలియ జేశారు. తప్పని పరిస్థితి ఐతే నీటి నిల్వల్లో అయిల్ బాల్స్ ను వదలాలి అన్నరు. నీటి నిల్వల్లో మలీరియా డెంగీ వంటి విషజ్వరాల ను కలుగజేసే దోమలు పెరిగే అవకాశం వుంది. కావున నీటినిల్వలు లేకుండా చుసు కోవాలి అన్నరు. జ్వరం ఉన్న ప్రతి ఒక్కరు విధిగా ప్రభూత్వ ఆసుపత్రి కి వచ్చి రక్త పరిక్షలు చేయించుకోవాలి అని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి అన్నారు. ఆహార పదార్థాలు వేడిగా ఉన్నపుడు తినేసేయాలి అన్నారు. వ్యక్తి గోత ఏరిశుభ్రతను పాటించంలి. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలి అన్నరు. ఈ కార్యక్రమం లో సి హెచ్ ఓ పూలమ్మ, హెచ్ ఇ ఓ కృష్ణయ్య, హెచ్ వీ శిర రాణి, హెచ్ ఎ (పురుషులు) రాందాను, ఎంపీ యూఏ (మహిళలు) జ్యోతి, ఆశా వర్కర్ నజ్మా తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట వంట కార్మికుల ధర్నా మంత్రి పొంగులేటి కి వినతి పత్రం అందించిన

### ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అధ్వర్యంలో వంట కార్మికులు ధర్నా నిర్వహించారు .ఈ సందర్భంగా రాష్ట్ర రెవిన్యు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారికి వినతిపత్రం అందచేశారు ఈ సందర్భంగా మంత్రి రానున్న రోజుల్లో సమస్యలు పరిస్కారం చేస్తాం అని హామీ ఇచ్చారు , ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టం లో పాఠశాల లో పనిచేస్తున్న వంట కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావటం తో కనీసం 10 వేలు వేతనం ఇస్తాం అన్న హామీ అమలు చెయ్యాలి అని కోరినారు ,ప్రభుత్వం వంట కార్మికుల కు నిత్యావసర సరుకులు , కోడి గుడ్లు , సరఫరా చెయ్యాలి అని డిమాండ్ చేశారు. అల్పాహారం ,స్నాక్స్ , వండిన పనికి పారితోషకం అందించాలి అని , ఇన్సూరెన్స్ , హెల్త్ కార్డు , యూనిఫామ్ , అమలు చెయ్యాలి అని వంట కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సతన్నపల్లి విజయ లక్ష్మి కోరినారు , ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు మంగ ,ప్రభావతి , ముత్యాలు, రమణ , కే .అరుణ , ఎం.పద్మ , క్రాంతి , సరళ , తదితరులు పాల్గొన్నారు

## రామవరం బ్రిడ్జి పక్కన సర్వీసు రోడ్డును వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించిన

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (**గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం బ్రిడ్జి పక్కన సర్వీసు రొడ్డును పునరద్ధరించి ,ప్రజలకు అందుబాటులోకి తేవాలని,అదేవిధగా బ్రిడ్జి పైన డివేడర్ ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారు వారితో పాటు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జాతీయ రహదారి అధికారులు ఆర్ అండ్ బి, ఈ ఈ, డి ఈ, మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ కూరపాటి విజయలక్ష్మి సుధాకర్, కంచర్ల జమలయ్య, తోటకూర శ్రీనివాస్ , నారాయణ తదితరులు ఉన్నారు.

## నాణ్యతాపనులకు తిలోదకాలు..శిథిలావస్థకు కల్వర్టు


### స్లాబ్ ఐరన్ తేలి దర్శనం...



బయ్యారం,(**గౌతమ్ న్యూస్ ):** ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఎన్నో మౌలిక వసతులను వారి దరి చేర్చేందుకు నిధులు వెచ్చిస్తూ గుత్తేదారులకు పనులు అప్పగించింది.కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు గుత్తేదారు మాత్రం అందరూ మనవారే అడిగే వారు లేరు అన్న చందంగా పనులు చేస్తూ మ...మా ...అనిపించారు. అధికారులు,గుత్తేదారు కూడబలుకుకొని ఆ బిల్లులు కాజేశారని స్తానికులు ఆరోపిస్తున్నారు.. వివరాల్లోకి వెళితే 2021- 22 ఆర్థిక సంవత్సరంలో వెంకట్రాంపురం నుండి చోక్లాతండా వెళ్లే ప్రధాన రహదారి మార్గమధ్యంలో దొమ్మరదాని చెరువు నుండి వచ్చే వాగుపై పాత కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో వాహన దారుల ఇబ్బందులు గుర్తించిన అధికార యంత్రాంగం ఆ స్థానంలో ఆర్ అండ్ బి అధికారుల ఆదేశానుసారం కల్వర్టు నిర్మాణానికి 40 లక్షల నిధులు ఆనాటి ప్రభుత్వం వెచ్చించి గుత్తేదారుకు సుమారుగా 40 లక్షల నిధుల కాంట్రాక్ పనులు అప్పగించటంతో గుత్తేదారు పనులు చేపట్టారు.ఆ పనులలో నాణ్యత లోపించడం తో కల్వర్టు స్లాబ్ పై ఇనుప చువ్వలు తేలి ఉండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు, స్థానికులు మండిపడుతున్నారు.అధికారుల అండదండలతో తు..తూ మంత్రంగా పనులు కాజేసిన గుత్తేదారుడికి బిల్లులు చెల్లించినా కల్వర్టు నిర్మాణం మున్నాళ్లకే శిథిలావస్థ స్థితికి చేరిందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.




## తొలి బడ్జెట్‌లో ఆర్థిక ఎజెండాపై దృష్టి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు మరోసారి ఆర్థిక మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించారు. నూతన ప్రభుత్వం త్వరలో తన మొదటి బడ్జెట్‌ను సమర్పించనుంది. ఈ నేపధ్యంలో మంత్రి సీతారామన్‌కు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఎలాంటి ప్రభావం చూపకుండా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే చర్యలను ప్రభుత్వం పరిశీలించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ పగ్గాలు చేపట్టిన సీతారామన్ తన ఆర్థిక ఎజెండాలో భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి కృషి చేయాల్సి ఉంటుంది. అలాగే 2047 నాటికి దేశాన్ని 'అభివృద్ధి చెందిన భారతదేశం'గా మార్చడానికి తగిన ఆ?ర్థిక సంస్కరణలను వేగవంతం చేసేదిశగా ముందడుగు వేయాలి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిజర్వ్ బ్యాంక్ నుండి డివిడెండ్ రూపంలో ప్రభుత్వం అందుకున్న రూ. 2.11 లక్షల కోట్లు దేశ ఆర్థిక స్థితికి మెరుగుదలకు సహాయకారిగా మారినట్లు నిరూపితమయ్యింది. మోదీ 3.0 ప్రభుత్వానికి దేశంలోని వ్యవసాయ రంగంలో ఒత్తిడిని పరిష్కరించడం, ఉపాధి కల్పన, మూలధన వ్యయాల వేగాన్ని కొనసాగించడం, ఆర్థిక ఏకీకరణ మార్గంలో ఉండటానికి ఆదాయ వృద్ధిని పెంచడం వంటివి కీలకంగా మారనున్నాయి. మరోవైపు బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ కొంత వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు బీమా కంపెనీల ప్రైవేటీకరణకు పలు ఆటంకాలు ఏర్పడుతున్నాయనే వాదన వినిపిస్తోంది. నిర్మలా సీతారామన్ 2019లో తొలిసారిగా ఆర్థిక శాఖ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుండి ఆమె ఈ బాధ్యతలను కొనసాగిస్తున్నారు. సీతారామన్ స్వతంత్ర భారతదేశంలో మొదటి పూర్తికాల మహిళా ఆర్థిక మంత్రిగా గుర్తింపు పొందారు. ఆమె ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో దేశం కోవిడ్ -19 మహమ్మారితో ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, వాటిని సమర్థవంతంగా దాటగలిగింది.

## పవర్ ఎంజాయ్ చేద్దామనుకుంటే కుదరదు.. పవన్ స్వీట్ వార్నింగ్



పార్టీ ఎమ్మెల్యేలకు జనసేనాని పవన్ కళ్యాణ్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన 20మంది ఎమ్మెల్యేలతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. 'పాతతరం రాజకీయాలకు కాలం చెల్లింది. అప్పటిలా కూర్చొని పవర్ ఎంజాయ్ చేద్దామనుకుంటే కుదరదు అని అన్నారు. ప్రజలు మనకు ఎంత మద్దతిచ్చారో వారికి కోపం వస్తే అంతే బలంగా నిలదీయగలరు. ఏదైనా సందర్భంలో వారు ఓ మాట అంటే భరించాలి. ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయవద్దు' అని పవన్ సూచించారు. కాగా, రేపు ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణ చేయనున్నారు.బుధవారం 11.27 నిమిషాలకు నాలుగో సారి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. అంతేకాకుండా జనసేన డిప్యూటీ సీఎం గా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# జీవం పోసుకున్న తపాల శాఖ

### లాభాల బాటలో పోస్టల్ శాఖ


నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** మారుతున్న శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం ప్రపంచంలో




పెరుగుతున్న నూతన టెక్నాలజీ సోషల్ మీడియా రంగ ప్రవేశం కంప్యూటర్ పరిజ్ఞానం పెరిగినప్పటికీ ఒకప్పటి పూర్వం 1764 సంవత్సరంలో స్థాపించిన భారత తపాలా వ్యవస్థ ఇండియా పోస్టల్ శాఖ ఇప్పటికి చెక్కుచెదరకుండా పాత జ్ఞాపకాలను మర్చిపోకుండా దేశ ప్రజలకు ఇండియా పోస్టల్ శాఖ సేవలందిస్తుంది, ప్రపంచంలోనే అతిపెద్ద తపాల వ్యవస్థగా పోస్టల్ సర్వీస్ ఏర్పడింది, ఆనాటి నుంచి నేటి వరకు మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న పరిజ్ఞానం ప్రకారం పోస్టల్ శాఖ కొత్త కొత్త వరవడితో ముందుకు సాగుతుంది, ఈస్ట్ ఇండియాలోని చెన్నై, బొంబాయి నగరాలలో 1764-76 మధ్య పోస్టల్ శాఖను ప్రారంభించారు, ఆ తర్వాత భారత దేశంలో సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తపాల వ్యవస్థ ఏర్పాటు అయింది, దేశంలో మొత్తం 23 తపాలా సర్వీసులు




ఉన్నాయి, తపాలా సర్వీస్ పోస్టల్ శాఖలో ఉత్తర ప్రత్యుత్తరాలతో పాటు ఇటీవల కాలం నుంచి కొత్త కొత్త సర్వీసులను సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు ఆర్థిక లావాదేవీలు, ఫిక్స్ డిపాజిట్, పొదుపు ఖాతా కరెంటు బిల్లుల చెల్లింపు, టెలిఫోన్ బిల్లుల




చెల్లింపు, తో పాటు కిసాన్ వికాస్ పత్రం, నెల నెల పొదుపు కథ తో పాటు అనేక సేవలు ఇప్పుడు అందుతున్నాయి, ఆనాడు కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రమే పోస్టల్ డిపార్ట్మెంట్ లో సేవలందించారు, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులు అందుబాటులోని ప్రాంతాలలో తపాల సేవలు ప్రజలకు ఎంతో దోహదపడుతున్నాయి ఆసరా పెన్షన్ ల తో పాటు, రైతు బంధు నిధులు రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా గ్రామాలలోని పోస్ట్ ఆఫీస్ లలో డబ్బు నగదు రూపంలో పొందుతున్నారు, బ్యాంకులు లేని అనేక గ్రామాల్లో



తపాల శాఖ సేవలు ప్రజలకు చేదోడువాదడుగా ఉన్నాయని చెప్పవచ్చు చిన్ననాటి జ్ఞాపకాల ప్రకారం ఆనాడు ఉపయోగించే టెలిఫోన్ తో పాటు ఇంగ్లాండ్ లెటర్, పోస్ట్ కార్డు ద్వారా దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులకు సమాచారాన్ని ఉత్తరం ద్వారా రాసి




పంపిస్తున్న రోజులు ఒక్కసారి జ్ఞాపకాలను కలిసి వేస్తుంది, ఎవరైనా అనారోగ్యంతో చనిపోయినప్పటికీ ఇంట్లో ఎలాంటి ఆపద వచ్చినా ఆ రోజుల్లో లెటర్ ద్వారా బంధువులకు ఉత్తరం రాసి పంపిస్తే మూడు రోజుల తర్వాత అందుతున్నది, ఈ రోజుల్లో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్ పరిజ్ఞానంతో చరవాణి సోషల్ మీడియా ఫోన్లు ద్వారా ప్రతి ఒక్కరి చేతుల్లో క్షణాలలో సమాచారాన్ని చేరవేస్తున్నారు, ప్రతి ఒక్కటి కూడా సెల్ ఫోన్ ద్వారా లావాదేవీలు జరుపుకుంటున్న రోజులు వచ్చాయి, డబ్బులు కూడా క్షణాలలో ఇతరుల అకౌంట్లోకి డిపాజిట్ చేసే గూగుల్ పే ఫోన్ పేలు అందుబాటులోకి రావడం భారతదేశం డిజిటల్ ఇండియా పేరుతో దేశవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం విశేషం

# మేము భారతీయులమే !! చెత్తకుండీ కాడి కుక్కలం,,,,

### మురికివాడల్లో అనాధలం!!

### చలి, వర్షం , ఎండ తెలియని అభాగ్యులం!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్ ):** ఈ దేశంలో పుట్టడం నేరమా! మేము భారతీయులమే మా పట్ల ఎందుకు చిన్న చూపు అయ్యమ్మ లేని అనాధలం అయినా మేము భారతీయులమే , అంటున్నారు, మురికివాడలలోని (స్లమ్) ఏరియాలో రోడ్ల పైన చెత్తకుండీల దగ్గర డంపింగ్ యార్డుల పక్క జీవనం గడుపుకుంటున్న పేద ప్రజల కష్టాలు వర్ణనాతీతం దేశానికి స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ ఈ దేశంలో పేదరికం పేదోని జీవితాలతో చెలగాటమాడుతుంది, భారతదేశం ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచిన దేశంగా డిజిటల్ ఇండియా కంప్యూటర్ యుగంలో ముందంజలో ఉందని చెప్పుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదోడి బాధలు కష్టాలను ఈ పట్టించుకోకపోవడం పట్ల మురికివాడలో జీవిస్తున్న అభాగ్యులు అమాయక ప్రజలు తల్లడిల్లి పోతున్నారు, రాజ్యాంగం ప్రవేశపెట్టిన చట్టాలు హక్కులు భారతదేశంలో ఉన్నప్పటికీ కేవలం ఎన్నికల సమయంలో పేద ప్రజలు గురించి ఒక దుంపుడు ఉపన్యాసాలు చెప్పడం ఎన్నికల తర్వాత గద్దెకెక్కిన పాలక ప్రభుత్వాలు ప్రతినిత్యం నరకం అనుభవిస్తున్న పేద ప్రజల గురించి పట్టించుకునే నాధుడు





మిర్యాలగూడలో డంపింగ్ యార్డులో భారీగా పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

లేదని విమర్శలు వస్తున్నాయి, ఈ దేశంలో ఆహార ధాన్యాలు తిండి గింజలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేస్తున్నప్పటికీ పేద ప్రజలకు కడుపునిండా సన్నబియ్యంతో అన్నం పెట్టలేని పరిస్థితి దాపురించింది, మురికివాడలలో దోమలు ,ఈగలు, కుక్కలు ,పందులు సంచరిస్తున్న ప్రాంతాలలో వేలాది మంది పేద ప్రజలు పొట్ట చేత పట్టుకొని కాయ కష్టం చేసుకుని దుర్భర జీవితం గడుపుతున్న కూడా ఈ ప్రభుత్వాలకు ఎప్పుడు బుద్ధి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పెద్ద పెద్ద బంగ్లాలు కార్లు, విలాసంతమైన జీవితం గడుపుతున్న ధనవంతులకు కూడా కనీసం కనికరం లేకపోవడం మీ పేద ప్రజల బాధలు పట్టించుకోకపోవడం బాధాకరం, ముందే వర్షాకాలం తుఫాను వర్షాలు వస్తున్న సందర్భంలో మురికివాడలలో జీవిస్తున్న పేద ప్రజలు వర్షానికి చలికి తట్టుకోలేక విలవిలలాడుతూ తమ ప్రాణాలను చేతులారా పోగొట్టుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి, ఇలాంటి విద్యుత్ సౌకర్యం లేకపోయినప్పటికీ ఉన్న కొద్దిపాటి దీపాలతో తమ పిల్లలను



చదివించుకుంటూ బట్టలు లేక తిండి లేక ఒక పూట తిండి తో కాలం వెళ్లదీస్తున్నారు, కడప నిండా మూడు పూటలు తిండి తింటున్న తోటి మానవునికి మురికివాడలో దీవిస్తున్న ప్రజలు గుర్తుకు ఎందుకు రావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు, మురికి వాడల లో సరైన వసతులు లేక త్రాగడానికి స్నానం చేయడానికి కూడా కనీసం నీళ్లు కూడా దొరకని పరిస్థితుల్లో వారానికి ఒకసారి కూడా స్నానం చేయని అభాగ్యులు అనాధలు పేద ప్రజలు వాళ్ల మనుషులు కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు, మానవ హక్కుల కమిషన్ ఉన్నప్పటికీ మానవుని హక్కులు అంతరించిపోతున్నాయి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు



తక్షణమే మురికివాడల్లో (స్లమ్) ఏరియాలో జీవిస్తున్న ప్రజలతోపాటు పట్టణాలలో గ్రామీణ ప్రాంతాలలో దుర్భర జీవితం గడుపుతున్న ప్రజల సంక్షేమం కోసం తక్షణమే ఒక్కొక్కరికి 10 కిలోల సన్నబియ్యం తోపాటు నెలకు 3000 రూపాయలు చొప్పున అందించాలని డిమాండ్ చేస్తున్నారు, ప్రతి ఒక్కరికి గృహం నిర్మించి ప్రజలు చలికి ఎండకు వర్షానికి ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఇటీవల దేశానికి మూడోసారి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్ పేరుతో నా ఈ భారత దేశంలో ఎక్కడా కూడా చెత్త కనపడకుండా శుభ్రంగా ఉండాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం పేద ప్రజలకు కూడా "స్వచ్ఛ మానవ దేశం పేరుతోనా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు,

# సేంద్రియ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులతో మంచి ఆరోగ్యం

### జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ.

కొండాపూర్ (**గౌతమ్ న్యూస్ ):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతులకు శాస్త్రవేత్తలతోపంట సాగు,వేసే విధానాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి విత్తనం ద్వారా రైతుల ఆదాయం పెంపు ఉంటుందని తెలియజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ విధానంలో రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కాన్ఫరెన్స్ నందు అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి పంట వేయడం ద్వారా ఎకరానికి మొక్కల సంఖ్య పెరగడంతో పాటుగా వాటి నుండి వచ్చిన కొమ్మల ద్వారా అత్యధిక సంఖ్యలో కాయలు, గుడలు రావడం ద్వారా ప్రతి పంట యొక్క దిగుబడి పెరిగి రైతుకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఈ పంట వితనం దగ్గర నుండి కోత వరకు వివిధ దశల్లో చేపట్టవలసిన సాంకేతిక అంశాల గూర్చి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ శాస్త్రవేత్త శ్రీ డాక్టర్ ప్రశాంత్ రైతులకు వివరించడం జరిగింది తదుపరి ఎలక్ట్రానిక్ వింగ్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించినటువంటి వివిధ వీడియోలను యూట్యూబ్ ద్వారా అధిక సాంద్రత పద్ధతిలో పంట వేయి పద్ధతి, వేసినటువంటి రైతుల అనుభవాలను వీడియో రూపంలో ప్రదర్శించడం జరిగింది అనంతరం ఇంతకుముందు సీజన్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శంకర్ అనే రైతు తన అనుభవాలను తనకు కలిగినటువంటి లాభాలను ఇతర రైతులతో పంచుకోవడం జరిగింది తదుపరి పద్మశ్రీ...శ్రీ చింతల వెంకటరెడ్డి అనే ఆదర్శ రైతు సివిఆర్



పద్ధతి ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందినటువంటి ఉత్తమ రైతు తన పొలంలోని మట్టిని ఉపయోగించి మట్టిని వడగట్టి నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలను కొంతవరకు పోషక పదార్థాలను అందించడంలో విజయవంతమైనటువంటి రైతు యొక్క విజయ గాథలు మిగతా రైతులతో తన అనుభవాలను పంచుకోవడం జరిగింది అదేవిధంగా తాను చేస్తున్నటువంటి వివిధ రకాల సేంద్రీయ పద్ధతులను ఇతర రైతులకు వివరించడం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు వ్యవసాయ విజ్ఞానం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఈ రైతు నేస్తం కార్యక్రమం ప్రతి మంగళవారం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొని తమ వ్యవసాయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కావలసినటువంటి విత్తనాలు మరియు ఎరువులను సరిపడా నిలువలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అదేవిధంగా ప్రతి పంట వేసేటువంటి రైతులు అన్ని బీటీ-2 విత్తన హైబ్రిడ్లు ఒకే రకమైనటువంటి దిగుబడిని ఇచ్చే అవకాశం ఉందని దిగుబడి కేవలం పంట వేసేటువంటి పద్ధతి నేల స్వభావం వాతావరణ అనుకూలతలు ఎరువుల మరియు పోషక యజమాన్యం తో పాటుగా సరైన సమయంలో సరైన మోతాదులో పురుగుమందుల పిచికారి వల్ల మాత్రమే దిగుబడి పెరిగే అవకాశం ఉందని కావున రైతులు ఒకే రకం ప్రత్తి విత్తన రకం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం లేదని, ఈ విధానంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని,అదేవిధంగా రైతులు తీసుకున్నటువంటి విత్తనానికి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని అధికారులు సూచించారు. రైతులకు కావలసినటువంటి క్రాప్ క్యాలెండర్ ను రూపొందించి రైతులకు తగిన సమయంలో వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రైతులకు వివిధ సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈరోజు కొండాపూర్ రైతు వేదికలో పై అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ,అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమీక్షలో ముఖ్యంగా విత్తనాల లభ్యత ఎరువుల ల భ్యత రైతు బీమా పరిష్కారం అదే విధంగా వర్షాకాలంలో చేయదగినటువంటి పంట నమోదు కార్యక్రమం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, మండల వ్యవసాయ అధికారి గణేష్, మండల వ్యవసాయ సహాయ సంచాలకులు మనోహర్, వ్యవసాయ అధికారి ప్రతిభ, సంగారెడ్డి వ్యవసాయ డివిజన్ పరిధిలో గల వ్యవసాయ విస్తీర్ణాధికారులు మరియు మండల రైతులు పాల్గొన్నారు.

## ఖానాపురంలో అజర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### గుండెకు సంబంధిత వ్యాధులతో పాటు ఉచితంగా అన్ని రకాల పరీక్షలు, మందులు అందజేత



ఖానాపురం (గౌతమ్ న్యూస్ ) : అజర హాస్పిటల్.హన్మకొండ వారి ఆధ్వర్యంలో ఖానాపురం మండలంలో నిష్టాయుతులైన వైద్యులచే ఉచిత వైద్య శిబిరం 13.06.2024 గురువారం నాడు ఖానాపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అజర హాస్పిటల్ నర్సంపేట ఏరియా మేనేజర్ వద్దె రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవించే ప్రజలకు ప్రస్తుతం పెరుగుతున్న రోగాలపై అవగాహన కల్పించడం కోసం ప్రజలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు..ఇందులో గుండెకు సంబంధించిన టెస్టులతో పాటు జనరల్ వైద్యం,బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా నాణ్యమైన మందులు సైతం అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7989829165,9391009728 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.

## గౌడ కులస్తులపై దాడిచేసిన విడిసీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ డిమాండ్



నర్సంపేట,(**గౌతమ్ న్యూస్ **): నిర్మల్ జిల్లా తానూర్ మండలం మహాలింగిలో గౌడ కులస్థులపై దాడి చేసిన విడిసీ లపై కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.కల్లు వ్యాపారం కోసం విడిసీ(విలేజ్ డెవలప్మెంట్ కమిటీ )కి సంవత్సరానికి 4.5 లక్షలు ఒప్పందంతో గీత కార్మికులు చెల్లించారు.ప్రస్తుతం 8 లక్షలు ఇస్తేనే వ్యాపారం చేయాలని, లేని పక్షంలో కల్లు అమ్ముకోకూడదని విడిసి ఆంక్షలు పెట్టడంతో బాధితులు అంత డబ్బులు చెల్లించలేమని తెలిపారన్నారు.వీడీసీ సభ్యులు కల్లు వ్యాపారం చేయొద్దని చెప్పడంతో వ్యాపారం బంద్ చేసి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకొని జీవనం సాగిస్తుంటే ఆది కూడా సహించని వీడీసీ పెద్దలు అడ్డుకున్నారని పేర్కొన్నారు. గ్రామంలో వీడీసీ సభ్యులు మరల మీటింగ్ పెట్టి 20 లక్షలు ఇస్తేనే అమ్ముకోవాలని తీర్మానం చేయగా మేము అంత డబ్బులు చెల్లించలేమని చెప్పిన గౌడ కులస్తులపై ఆగ్రహం చెందిన వీడీసీ సభ్యులయిన కృష్ణ పటేల్, గిరి నారాయణ, జరికోట పోశెట్టి, మారుతీ తో పాటు మరో 10 మంది గీత కార్మికుల ఇండ్లపై దాడులు చేయడం జరిగిందని, ఈ దాడిలో సాయినాద్ గౌడ్ గాయపడటం జరిగిందన్నారు. ఇప్పటికైనా గీత కార్మికులపై దాడులు చేసిన వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, గీత కార్మికులకు న్యాయం చేయాలని రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# భూక్య శ్రీను కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి

### లంచాలకు ఆశపడి కోర్టు కేసులలో ఉన్న భూములకు పర్మిషన్లు ఇస్తున్న మున్సిపాలిటీ అధికారులు

### మున్సిపాలిటీ అధికారుల అవినీతి అక్రమాలపై గిరిజన ఐక్య సంఘాలతో ఆందోళన ధర్నా

### వివాదాస్పద భూములకు ఇచ్చిన పర్మిషన్ లను వెంటనే రద్దు చేయాలి

### గిరిజన ఐక్య సంఘాల డిమాండ్



మానుకోట జిల్లా(**గౌతమ్ న్యూస్ **): మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంబేద్కర్ సెంటర్ నుండి మున్సిపాలిటీ వరకు కుటుంబ





సభ్యులు అంతా భారీ ర్యాలీ నిర్వహించి, మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మున్సిపాలిటీ అధికారుల అవినీతి అక్రమాలపై భూక్య శ్రీను కుటుంబ సభ్యులతో పాటు గిరిజన, ఐక్య సంఘాల మద్దతుతో భారీ ఎత్తున ఆందోళన ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు భూ బాధితులు మాట్లాడుతూ మహబూబాబాద్ మండలం శనగపురం గ్రామ వీరారం తండా కు చెందిన భూక్య శ్రీను మరియు వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ఆస్తులు రెవెన్యూ సర్వే నెంబర్లు 275, 278, 279 లలో వారికి ఉండబడిన మొత్తం ఆస్తి భూమి దాదాపు 90 ఎకరాలు 1973- 74 వ సంవత్సరంలో 38/%జు% టెన్నెన్స్ యాక్ట్ ద్వారా సంక్రమించిన భూములలో సుమారు 50 ఎకరాల భూమిని భూక్య శ్రీను తాతలు మరియు వారి కుటుంబ సభ్యులు అమ్ముకోగా మిగిలిన 40 ఎకరాల భూములను కొంతమంది భూకబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించుకుని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, మున్సిపాలిటీ అధికారులను ప్రలోభాలకు గురి చేస్తూ వారిని తప్పుదోవ పట్టిస్తూ మిగిలిన భూములను కబ్జా చేసుకున్నారు. ఈ భూముల విషయంలో 2012 వ సంవత్సరం నుండి కోర్టుల చుట్టూ తిరుగుతూ హైకోర్టు - లోయర్ కోర్టులతో పాటు రాష్ట్ర మరియు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల చుట్టూ తిరుగుతూ ఉన్నా కూడా గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల అండ దండలతోటి భూ-కబ్జాదారులు రెచ్చిపోయి పైన తెలుపబడిన సర్వే నెంబర్లలో ఉన్న భూములు కోర్టు లలో కేసులు పెండింగ్లో ఉన్న కూడా మున్సిపాలిటీ అధికారులు లంచాలకు బానిసై తమ హోదాను మరిచిపోయి నియమా నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణ అనుమతులు జారీ చేశారు. ఇదే సర్వే నెంబర్లు గల భూములలో బాధితుడు భూక్య శ్రీను గృహ నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు పెట్టుకుంటే వాటిని మున్సిపాలిటీ అధికారులు ఈ భూములు కోర్టులలో కేసులు పెండింగ్లో ఉన్నాయని చెప్పుతూ పరిమిషన్లను రద్దు చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలి. లేనియెడల అన్ని కుల సంఘాల మద్దతుతో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. మరి భూ కబ్జాదారులకు ఒక న్యాయం గిరిజన రైతులకు ఒక న్యాయమా అని గిరిజన ఐక్య సంఘాల నాయకులు ప్రశ్నించారు. మున్సిపాలిటీ అధికారులకు డబ్బులు ముడుపుల రూపంలో అందుతనే పనులు జరుగుతున్నాయి. కానీ ముడుపులు అందకపోతే పనులు వివిధ కారణాలు చెప్పి రద్దు చేయడం జరుగుతుంది. ఈ విషయంలో బాధితుడు భూక్య శ్రీను కలెక్టర్ కార్యాలయం చుట్టూ, మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా కూడా ఫలితం లేకపోయింది. ఇకనైనా స్థానిక కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు దీనిపై స్పందించి పైన తెలుపబడిన సర్వే నెంబర్లలో సమగ్ర విచారణ జరిపించి బాధితులు భూక్య శీను కుటుంబ సభ్యులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు కోర్టు కేసులలో పెండింగ్లో ఉన్న భూమి సర్వే నెంబర్లలో ఇచ్చిన గృహ నిర్మాణ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే రోజులలో అన్ని కుల సంఘాలను కలుపుకొని భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్, జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్, హనుమాన్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, గోరు సేన జిల్లా కార్యదర్శి బోడ హరిలాల్, భూక్య శ్రీను, భీమ, లాల్ సింగ్, భావ సింగ్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చెరువు శిఖం, ప్రభుత్వ భూములు అక్రమణకు మున్సిపల్ శాఖ పరోక్షంగా సహకరిస్తుంది

### మానుకోట వద్దన్నా మళ్లీ మళ్లీ వస్తున్న మున్సిపల్ కమిషనర్ మున్సిపాలిటీ కమిషనర్ గా రావడం ఇది నాలుగో సారి




మానుకోట జిల్లా/హైదరాబాద్(**గౌతమ్ న్యూస్ **): ఒక తెలంగాణ ఉద్యమకారుడి స్థలం ఆక్రమించి మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఇంటిని నిర్మిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకుడికి సహకరిస్తున్న మహబూబాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ అక్రమాలు, అవినీతి గురించి హైదరాబాద్ ప్రగతి భవన్ లో ఫిర్యాదు చేసిన మహబూబాద్ వాసి. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఎండి అహ్మద్ ఖాన్, తండ్రి యూసఫ్ అలీ ఖాన్. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సర్వం కోల్పోయిన తెలంగాణ ఉద్యమకారుడు. ఎండి అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ మహబూబాద్ పట్టణంలోని గుముదూరు ఏరియాలో నర్సంపేట రోడ్డులో నాకు వంశపారంపర్యంగా వచ్చిన అసైన్డ్ స్థలం కలదు, దాని సర్వే నెంబరు 287. మహబూబాబాద్ లోని ఈ 287 సర్వే నెంబర్ లలో రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మెరకు ఎలాంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వకూడదని మున్సిపాలిటీ కి ఆదేశాలు ఉన్నాయి. ఈ సర్వే నెంబర్ భూములలో గతంలో మూడు నాలుగు సార్లు నిర్మించిన నిర్మాణాలకు ప్రభుత్వ అధికారులు జె.సి.బి ల ద్వారా కూల్చడం జరిగినది. అయితే ఇప్పుడు మా 287 సర్వే నెంబర్ భూమిలో దాదాపు 3 నెలలుగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక వ్యక్తి మున్సిపాలిలో ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేకుండా, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతూ ఉంటే, నేను మూడు నెలలుగా మున్సిపాలిటీ కమిషనర్ కి పలుమార్లు ఫిర్యాదు చేసినా, కమిషనర్ కానీ, టి.పి.ఎస్ కానీ, ఆ నిర్మాణాన్ని ఆపక, పైగా ఆ నిర్మాణానికి పరోక్షంగా, అతనికి సహకరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కమిషనర్ మహబూబాద్ మున్సిపాలిటీకి కమిషనర్ గా రావడం ఇది నాలుగో సారి. ఈ కమిషనర్ పై గతంలో కూడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. గత ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు ఈయన ను అన్ని రకాలుగా రక్షణ కల్పించుకుంటూ వచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది, ప్రభుత్వ పనితీరు కూడా మారింది. అధికారులు కూడా చాలా చోట్ల బాధ్యతగా తమపనులు చేస్తున్నారు. కానీ మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ మాత్రం ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా తనకి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఈ అక్రమ నిర్ణయంపై నేను 21-03-2024 రోజు కమిషనర్ కి ఫిర్యాదు చేశాను. నెల రోజుల దాకా స్పందించలేదు. ఆ తర్వాత 25-04-2024 రోజు, జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదుచేశాను. అదే రోజు మరోసారి మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదుచేశాను. అయినా ఆ నిర్మాణాన్ని ఆపే ప్రయత్నం కానీ, కూల్చివేత ప్రయత్నం కానీ చేయలేదు. పైగా ఇంటి నిర్మాణానికి అన్ని విధాలుగా అతనికి సహకరిస్తున్నారు. మున్సిపల్ అధికారుల తీరు పై మరోసారి, తేదీ:- 16-05-2024 రోజు కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. కలెక్టర్ ఆ నిర్మాణం పై విచారణ జరిపించి, చర్యలు తీసుకోమని కమిషనర్ కి ఆదేశించినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారం రోజుల క్రితం కంటి తుడుపు చర్యగా, నిర్మాణం నిలిపివేయాలని ఆ ఇంటికి నోటీసులు అంటించడం జరిగింది. మళ్లీ యధావిధిగా నిర్మాణం కొనసాగుతుంది. మళ్ళీ ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోవడం లేదు.ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులది. అలాంటిది మహబూబాబాద్ లో ప్రతిరోజు పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతుంటే, మున్సిపల్ శాఖ లంచాలకు మరిగి చెరువు శిఖం భూములు, ప్రభుత్వ భూముల్లో అక్రమనిర్మాణాలను అనుమతులు లేకుండా నిర్మించుకొనుటకు పరోక్షంగా సహకరిస్తుంది. దీని ద్వారా మున్సిపల్ శాఖకు అనుమతుల రూపంలో రావాల్సిన రాబడి కూడా పోతుంది. ఎవరైనా ఫిర్యాదు చేసినా, ఆ ఫిర్యాదును పట్టించుకోక, వారిని మున్సిపల్ శాఖ అధికారులు బెదిరిస్తున్నారు. చెరువు శిఖం, ప్రభుత్వ భూములు అక్రమణకు మున్సిపల్ శాఖ పరోక్షంగా కారణమవుతుంది. నేనొక తెలంగాణ ఉద్యమకారుడిని, గత ప్రభుత్వ చర్యల వల్ల, తెలంగాణ ఉద్యమకారుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయి. ఈ ప్రభుత్వం లోనైనా మాకు న్యాయం జరుగుతుంది అనుకుంటే ప్రభుత్వ అధికారుల అవినీతివల్ల, ఇప్పుడు కూడా నష్టపోతున్నాము. మహబూబాబాద్ కమిషనర్ పై విచారణకు పై అధికారులను ఆదేశించాలని, చెరువు శిఖం, ప్రభుత్వ భూములలో జరుగుతున్న నిర్మాణాలపై, కమీషనర్ ను బాధ్యుడిని చేస్తూ, కమిషనర్ పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, మున్సిపల్ అధికారులపై కఠిన చర్య తీసుకోవాలని ప్రభుత్వ, చెరువు శిఖం భూములు రక్షించాలని కోరుతూ, అలాగే నా భూమిలో జరుగుతున్న నిర్మాణాన్ని ఆపి, ఆ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేతకు అధికారులను ఆదేశించి, నాకు న్యాయం చేయాలని దయామయులైన తమరికి నా యొక్క ప్రార్ధన.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెవెన్యూ మరియు గృహనిర్మాణ శాఖల సమీక్ష సమావేశం లో పాల్గొన్న

### రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ **): కొత్తగూడెం కలెక్టరేట్ : ప్రజలంటేనే ప్రభుత్వమని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గం లోని ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా చూడవలసిన బాధ్యత మన పైన ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మరియు పత్రికా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజా పాలన సక్రమంగా పరిపాలించడానికి ఈ ప్రభుత్వం మీద నమ్మకంతో మమ్మల్ని ఎన్నుకోవడం జరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు నియోజకవర్గంలోని శాసనసభ్యులను సంప్రదించి నియోజకవర్గంలోని సమస్యలను తప్పనిసరిగా



ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు, త్రాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, కల్వర్టులు మీద ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అలాగే అర్హులైన వృద్ధులకు, వికలాంగులకు, వితంతు మహిళలకు, ఒంటరి మహిళలకు, ఆసరా పింఛన్లు అందేలా చూడాలని, అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామపంచాయతీలలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడి స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా రిపేర్లు ఉంటే సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు ప్రజలకు సేవ చేయడానికి విధులు నిర్వహిస్తున్నారని, తప్పనిసరిగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 39 వేల కోట్లు ఖర్చు చేసిన గ్రామాలలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, మా ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి మంచి నీరు అందే విధంగా చర్యలు చేపట్టామని, గిరిజన గ్రామాలలో నిర్మాణం చేపట్టే రోడ్లు ఫారెస్ట్ వారు అడ్డంకులు సృష్టిస్తే దానికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి అన్ని గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించాలని, భద్రాచలం కొత్తగూడెం డివిజన్లలో 30 శాతం కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల పనులు త్వరగా పూర్తిచేసి పిల్లలకు ఇబ్బంది కలగకుండా పండుగ వాతావరణంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులను సంప్రదించి పాఠశాలలను ప్రారంభోత్సవం చేయాలని, అదే రోజు పిల్లలకు బుక్స్, యూనిఫామ్ మిగతా మెటీరియల్ అందజేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలోని గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలను పిల్లలకు మొదటి విడతగా తెలుగు లో విద్యాబోధన ప్రారంభించామని, రాబోయే రోజుల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రాష్ట్రంలో 650 కోట్లు పైచిలుకు డబ్బులు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 80 శాతం వరకు పాఠశాలలు పూర్తయ్యాయని, వారం రోజుల్లో అన్ని పాఠశాలలు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశామని, తెలంగాణ రాష్ట్రంలో విద్యను బలోపేతం చేయడానికి స్కూల్స్ తో పాటు కాలేజీల నిర్మాణం కూడా చేపట్టామని అన్నారు.ఎటువంటి అవతవకలు జరగకుండా ధరణి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ ముఖ్యంగా గిరిజన గ్రామాలలోని రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయాలని ధరణి ఆన్లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల 45 వేల పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు ఎలక్షన్ కోడ్ రాకముందే లక్ష వరకు క్లియర్ చేశామని, ఆ తర్వాత మిగిలిన దరఖాస్తులు కొత్తగా రైతులు సమర్పించిన దరఖాస్తులు కలుపుకొని రెండు లక్షల 55 వేలు పెండింగ్ లో ఉన్న వాటిని ధరణి లోపాలు సరిదిద్ది యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో పరిష్కరిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం లో కొన్ని గ్రామాలలో ముఖ్యంగా చేతకొండ, రేగళ్ల ,పాల్వంచ లలో వేల ఎకరాలు భూములకు ఆన్లైన్ ప్రక్రియలలో సమస్యలు వస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ సమన్వయంతో ఒక వారం రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్యం పరంగా మారుమూల గిరిజన గ్రామాలలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పీహెచ్సీలలో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, మారుమూల గ్రామాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేకంగా అంబులెన్సును అందుబాటులో ఉంచుకోవాలని, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండేలా సంబంధిత వైద్యశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రిమోట్ ఏరియాలలో నియోజకవర్గాలలోని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ తో పాటు ఐటీడీఏ పీవో, ఆర్డీవోలు జిల్లా అధికారులు అన్ని ఆసుపత్రులను తనిఖీ చేయాలని, అన్ని ఆసుపత్రులలో సిబ్బంది అందరూ ఉండేలా చూడాలని ఏదైనా గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం అసంపూర్తిగా ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. భద్రాచలం నియోజకవర్గం లో ఎక్కువ శాతం గిరిజన గ్రామాలలో త్రి ఫేస్ కరెంటు సరిగా లేదని దానికి సంబంధించిన సర్వే చేపట్టి ప్రతిపాదనలను సమర్పించాలని అలాగే వైరా నియోజకవర్గంలో ఎక్కువ శాతం గిరిజనులు నివసించే గ్రామాలు ఎక్కువగా ఉన్నందు న ఫారెస్ట్ వారు అడ్డంకి లేకుండా చేసి వ్యవసాయ భూములకు కరెంటు, బోర్లు వేయించాలని అన్నారు. జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఆగస్టు సెప్టెంబర్ మాసం వరకు ఎరువులు సిద్ధంగా ఉంచి రైతులందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కరెంటు సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. అలాగే ఆగస్టు 15వ తేదీలోగా రైతులందరికీ రుణమాఫీకి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని రుణమాఫీ చేయడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చారని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వ భూములు గానీ ప్రజలకు సంబంధించిన పట్టా భూములు గాని ఎవరైనా కబ్జా చేసినట్లు తన దృష్టికి వస్తే వెంటనే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీమతి ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, జెసి వేణుగోపాల్, డిఆర్ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ కేబినెట్‌లో ఈ ఐదుగురు.. ఇదొక సర్‌ప్రైజ్ ప్యాక్!



కేంద్ర మంత్రివర్గంలో చోటు పొందడం అంటే అది ఒక అత్యున్నత స్థానానికి చేరుకున్నట్లు లెక్క. దేశం అంతటిని ప్రభావితం చేయడానికి అవకాశం ఉంటుంది. ఈసారి ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల నుంచి ఐదుగురికి అవకాశం దక్కింది.ఎముగ్గురు బీజేపీకి చెందినవారు కాగా, ఇద్దరు టీడీపీవారు. తెలుగుదేశం పార్టీ నాలుగు మంత్రి పదవులు ఆశించినా రెండు మాత్రమే లభించాయి. తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఏపీ నుంచి కె రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మలకు చోటు లభించింది. వీరిలో అనూహ్యమైన పేరు వర్మ అని చెప్పాలి. కొంతకాలం క్రితం వరకు ఆయన ఏపీలో ఒక సాధారణ నేత. భీమవరం ప్రాంతంలో బాగా తెలిసిన వ్యక్తే అయినా, ఇంత వేగంగా ఆయన కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడు అవుతారని ఎవరూ ఊహించలేదు. రాజకీయాలలో ఎప్పుడు ఎవరికి అవకాశం వస్తుందో చెప్పలేమనడానికి వర్మ ఒక ఉదాహరణ అవుతారు. ఆయన మొదటి నుంచి భారతీయ జనతా పార్టీలోనే ఉన్నారు. ఆయన టీవీ షోలలో బీజేపీ తరపున చర్చలలో పాల్గొంటుండేవారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడుగా పనిచేశారు. తదుపరి పార్టీ రాష్ట్ర నాయకుడుగా కొనసాగుతున్నారు. తెలుగుదేశంతో పొత్తు కుదిరిన తర్వాత బీజేపీకి కేటాయించిన నరసాపురం నుంచి ఎంపీ పదవికి పోటీచేయాలని వైఎస్సార్‌సీపీ దూరం అయిన సిట్టింగ్ సభ్యుడు రఘురామ కృష్ణంరాజు గట్టి ప్రయత్నం చేశారు. ఆయన కూటమిలోని మూడు పార్టీలలో ఏదో ఒక పక్షం సీటు ఇస్తుందని ఆశించారు. బీజేపీ అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపలేదు. ఆయన బీజేపీ సభ్యుడు కాదని అందువల్లే టిక్కెట్ ఇవ్వలేదని ఆ పార్టీవారు చెప్పినా, అది సాకు అని చాలా మంది భావించారు. దాంతో రఘురామ టీడీపీలో చేరి ఉండి స్థానం నుంచి పోటీచేసి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వర్మ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. నరసాపురంలో క్షత్రియ వర్గానికి చెందిన నేతకు టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించుకున్న తర్వాత అక్కడ ఉన్న వారిలో ఈయనే ప్రముఖుడుగా తెరపైకి వచ్చారు. బహుశా వర్మ కూడా ఊహించి ఉండకపోవచ్చు. వర్మను మార్చించాలని కొంతమంది ప్రయత్నం చేయకపోలేదు. అయినప్పటికీ, పార్టీ కోసం నిలబడిన వ్యక్తిగా వర్మ వైపే బీజేపీ అధిష్టానం మొగ్గు చూపింది. తద్వారా పార్టీలో కష్టపడి పనిచేసేవారికి, సుదీర్ఘకాలం పార్టీలో ఉన్నవారికి అవకాశాలు వస్తాయన్న నమ్మకం కలిగించారు. వర్మ ఇక్కడ నుంచి గెలుస్తారా? లేదా? అనే సంశయం తొలుత ఉన్నప్పటికీ, వైఎస్సార్‌సీపీ తన అభ్యర్థిగా బీసీ నేతను ఎంపిక చేసుకోవడం వర్మకు కలిసి వచ్చిందని చెప్పాలి. నరసాపురంలో ఎక్కువసార్లు క్షత్రియవర్గం వారే ఎంపీలు అవుతూ వచ్చారు. ఆ సామాజికవర్గం తక్కువ సంఖ్యలోనే ఉన్నా, వారి పలుకుబడి చాలా పెద్దదిగా భావిస్తారు. అదంతా వర్మకు ప్లస్ పాయింట్ అయింది. మనిషి కూడా సౌమ్యుడుగా పేరొందారు. అన్నీ కలిసి వచ్చి వర్మ ఎంపీగా గెలుపొందడమే కాకుండా ఏకంగా కేంద్ర మంత్రి అయిపోయారు. ఇది కలయో, నిజమో అనుకునేంతలోనే ఈ రాజకీయ పరిణామాలు జరిగిపోయాయి. రాజకీయాలలో కాకలు తీరిన సీ.ఎమ్ రమేష్, పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలను కాదని వర్మవైపు బీజేపీ మొగ్గుచూపి కేంద్రంలో స్థానం కల్పించారు. ఒకరకంగా రమేష్, పురందేశ్వరిలకు కాస్త అసంతృప్తి కలిగించే అంశమే అయినా, దాని గురించి మాట్లాడకపోవచ్చు. పురందేశ్వరి కాంగ్రెస్ హయాంలో మన్మోహన్ సింగ్ క్యాబినెట్ లో మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆమె బీజేపీలో చేరి 2014, 2019లలో పోటీచేసినా గెలవలేకపోయారు. అయినా పార్టీలో జాతీయ స్థాయిలో క్రియాశీలక పాత్ర పోషించారు. తదుపరి ఆమెను ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా నియమించారు. దాంతో ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మాజీ సీఎం ఎన్.టి రామారావు కుమార్తెగా కూడా ఆమె అందరికి తెలిసిన నేతగా ఉన్నారు. తెలుగుదేశంతో పొత్తు కుదర్చడంలో ఆమె గట్టి ప్రయత్నం చేశారు. అందుకు అధిష్టానం కూడా అంగీకరించింది. ఆమె రాజమండ్రి నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఆమెకు కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని చాలా మంది అనుకున్నారు. కారణం ఏమో కానీ ఆమెకు అవకాశం రాలేదు. స్పీకర్ లేదా, డిప్యూటి స్పీకర్ వంటి పదవి ఏదైనా వస్తుందా అని ఆమె మద్దతుదారులు ఆశిస్తున్నారు. ఇక మరో కీలకమైన నేత సీఎం రమేష్. ఆయన రాజకీయ జీవితం అంతా తెలుగుదేశంతో ముడిపడి ఉంది. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు సొంత మనిషిగా గుర్తింపు పొందారు. 2019 ఎన్నికలలో టీడీపీ పరాజయం తర్వాత వ్యూహాత్మకంగా బీజేపీలో చేరారు. ఆ పార్టీలో ఉంటూ చంద్రబాబు ప్రయోజనాలను పరిరక్షించడంలో ముఖ్యభూమిక పోషించారని చాలామంది విశ్వసిస్తారు. అలాగే టీడీపీతో పొత్తు పెట్టుకునేలా అధిష్టానాన్ని తనదైన శైలిలో ప్రభావితం చేశారని చెబుతారు. ఆ తర్వాత ఆయన వ్యూహాత్మకంగా అనకాపల్లి స్థానాన్ని ఎంపిక చేసుకుని బీజేపీ టిక్కెట్ సాధించగలిగారు. కడప జిల్లాకు చెందినవారైనప్పటికీ, తన అంగ, అర్థ బలంతోపాటు, అక్కడ ఉన్న టీడీపీ నేతలంతా తనకు బాగా తెలిసినవారే కావడంతో ఆయనకు కలిసి వచ్చింది. ఫలితంగా ఆయన విజయం సాధించిన తర్వాత కచ్చితంగా ఆయనకున్న పలుకుబడి రీత్యా కేంద్ర మంత్రి పదవి పొందుతారని చాలామంది భావించారు. కానీ బీజేపీ అధిష్టానం ఆయనకు పదవి ఇవ్వలేదు. తెలుగుదేశం పక్షాన కింజారపు రామ్మోహన్ నాయుడు మూడోసారి లోక్ సభకు ఎన్నికై మోదీ మంత్రివర్గంలో క్యాబినెట్ హోదా పొందారు. ఇది అరుదైన విషయమే. ముప్పై ఆరేళ్ల వయసులోనే ఈ స్థాయికి రావడం గొప్ప సంగతే. రామ్మోహన్ నాయుడు తండ్రి ఎర్రన్నాయుడు కూడా కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ టైమ్ లో మంత్రి పదవి చేశారు. వాజ్ పేయి ప్రభుత్వ టైమ్ లో స్పీకర్ అవుతారని భావించారు. కానీ ఆ పదవి జి.ఎమ్.సి బాలయోగిని వరించింది. బాలయోగి అనూహ్య మరణం తర్వాత ఆ పదవి వస్తుందని ఆశించారు. కానీ గుజరాత్ పరిణామాల నేపథ్యంలో పదవి తీసుకోవడానికి చంద్రబాబు అంగీకరించలేదు. దాంతో ఎర్రన్నాయుడు కు మళ్లీ అవకాశం రాలేదు. ఇప్పుడు ఆయన కుమారుడు రామ్మోహన్ నాయుడుకు పదవి దక్కడం విశేషం. తండ్రి రాజకీయ వారసత్వంతో పాటు, కేంద్రంలో పదవి కూడా దక్కించుకున్నారు. తెలుగుతోపాటు ఆంగ్లం, హిందీ భాషలలో పట్టు ఉండడం ఈయనకు కలిసి వచ్చే పాయింట్ అని చెప్పాలి. యువకుడు, పార్టీకి కట్టుబడి పనిచేయడం ప్లస్ అయింది. టీడీపీ ఎంపీలలో వరసగా మూడుసార్లు ఎంపీ అయిన వ్యక్తి ఈయనే. ఉత్తరాంధ్రలో బీసీ వర్గానికి చెందిన నేతగా గుర్తింపు పొందారు. గుంటూరు నుంచి ఈసారి గల్లా జయదేవ్ పోటీచేయకపోవడంతో రామ్మోహన్ కు పోటీ లేకపోయిందని చెప్పవచ్చు. గుంటూరు నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ కు కూడా కేంద్రంలో పదవి రావడం విశేషం. ఎన్డీయే అధికారంలోకి రావడంతో ఈయనకు చాన్స్ వస్తుందన్న భావన ఏర్పడింది. దానికి తగ్గట్లే టీడీపీ నాయకత్వం ఈయనకు అవకాశం కల్పించింది. ఆరువేల కోట్ల సంపద కలిగిన నేతగా ప్రచారంలో ఉన్న ఈయన కేంద్రంలో మంత్రి అయ్యారు. జనసేన నుంచి వి. బాలశౌరి కేంద్ర మంత్రి అవుతారని ప్రచారం జరిగినా ఎందుకో కాలేకపోయారు. ఆయన గతంలో వైఎస్సార్‌సీపీ ఎంపీగా ఉండేవారు. ఈ ఎన్నికలలో జనసేన నుంచి మచిలీపట్నంలో గెలుపొందారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రి తీసుకోవడానికి ప్రస్తుతం సిద్దపడలేదని, అందుకే బాలశౌరికి అవకాశం రాలేదని మీడియాలో వార్తలు వచ్చాయి. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి పదవి దక్కించుకున్నారు. 2018 తెలంగాణ శాసనసభ ఎన్నికలలో అంబర్ పేట నుంచి ఓటమి చెందడమే ఈయనకు వరం అయింది. ఆ తర్వాత 2019 లోక్ సభ ఎన్నికలలో సికింద్రాబాద్ నుంచి పోటీచేసి విజయం సాధించడం, మోదీ మంత్రి వర్గంలో చోటు దక్కడం జరిగిపోయాయి. ఆ రకంగా ఈయన రాజకీయ భవిష్యత్తు మారిపోయింది. పార్టీ కార్యకర్తగా జీవితాన్ని ఆరంభించి కేంద్రంలో క్యాబినెట్ హోదాకు ఎదిగిన నేత ఈయన. ప్రజలతో మమేకం అవడం ద్వారా ఆదరణ చూరగొన్నారు. మరో నేత బండి సంజయ్ కు కేంద్రంలో స్థానం లభించింది. బీసీ వర్గానికి చెందిన ఈయన రాజకీయ ప్రస్తానం కరీంనగర్ మున్సిపల్ రాజకీయాల నుంచి కావడం విశేషం. అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పొందినా, తదుపరి కరీంనగర్ నుంచి లోక్ సభకు ఎన్నికవడం, ఆ తర్వాత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కావడం ఒక సంచలనం. ఫైర్ బ్రాండ్ గా అనతికాలంలోనే పేరొందిన ఈయన అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంపై పెద్ద పోరాటాలే సాగించారు. ఈయనను బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడం అందరిని ఆశ్చర్యపరచింది. దాంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ విజయావకాశాలు దెబ్బతిన్నాయన్న అభిప్రాయం ఏర్పడింది. దానిని గుర్తించిన పార్టీ నాయకత్వం పార్టీలో జాతీయ హోదా కల్పించింది. తిరిగి ఇప్పుడు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఇచ్చింది. సీనియర్ నేత డీకే అరుణ, మరో నేత ఈటల రాజేందర్ లు కూడా కేంద్రంలో పదవులు ఆశించారు. కానీ దక్కలేదు. కిషన్ రెడ్డికి పదవి ఇచ్చినందున అరుణకు అవకాశం ఉండదు. అలాగే బండి సంజయ్ కు లభించిన తర్వాత ఈటలకు చాన్స్ రాదు. కాకపోతే ఈటలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వవచ్చని ప్రచారం జరుగుతోంది. ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయని చెప్పడానికి ఈటల రాజకీయ జీవితం కూడా ఉదాహరణే. కేసీఆర్ ప్రభుత్వం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత జరిగిన పరిణామాలలో ఆయన గడ్డు పరిస్థితి ఎదుర్కున్నారు. ఒక షెల్టర్ గా ఉంటుందని భావించి బీజేపీలో చేరారు. అది ఆయనకు కలసి వచ్చింది. గత శాసనసభ ఎన్నికలలో ఓటమి చెందినా, మల్కాజిగిరి నుంచి ఎంపీ కాగలిగారు. మొత్తం మీద చూస్తే బీజేపీలో మొదటి నుంచి ఉన్న నేతలకే మోదీ ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తుంది. కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మలకు అందుకే పదవులు దక్కాయి. దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేష్, డి.కె అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి వంటి నేతలు ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన నేతలు కావడం గమనార్హం. టీడీపీ నుంచి ఒక బీసీ నేతకు, బీజేపీ నుంచి మరో బీసీ నేతకు అవకాశం వచ్చింది. ముగ్గురు అగ్రవర్ణాల వారికి మంత్రి పదవులు దక్కాయి. వీరందరికి అభినందనలు చెబుదాం.

## తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల



తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన తెలంగాణ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ లింబాద్రి పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు.ఎడ్ సెట్‌కు 29,463 మంది విద్యార్థుల పరీక్షకు హాజరు కాగా 28,549 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు అయ్యారు. నల్గొండలోని మహాత్మాగాంధీ వర్సిటీ ఆధ్వర్యంలో మే 23న జరిగిన ఎడ్‌సెట్ పరీక్ష ప్రిలిమినరీ కీని ఇటీవల విడుదల చేసిన అధికారులు తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఎడ్‌సెట్‌లో 96.90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన నవీన్ మొదటి ర్యాంకు సాధించాడు. హైదరాబాద్?కు చెందిన యువతి అషితకు రెండో ర్యాంక్ , మూడో స్థానంలో శ్రీతేజ నిలిచారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30వేల మంది హాజరయ్యారు. అయితే వీరికి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. సెషన్-1లో 16,929 మందికి గానూ 14,633 మంది, సెషన్-2లో 16,950 మందికి గానూ 14,830 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఏడాది నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎడ్‌సెట్ పరీక్షల బాధ్యత చేపట్టిన సంగతి తెలిసిందే. ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్ల బీఎడ్ (బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్) కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో మొత్తం 14285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

## జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం




భద్రాద్రి కొత్తగూడెం: జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని మంత్రి చెప్పుకొచ్చారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు వాటర్ సప్లై అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు" అని హెచ్చరించారు.

## ఏపీకి రూ. వేల కోట్లను మంజూరు చేసిన కేంద్రం



ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకార ఏర్పాట్లు.. విజయవాడలో తుదిదశకు చేరుకున్నాయి. గన్నవరం సమీపంలోని కేసరాపల్లి ఐటీ పార్క్ వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు కానుంది. ఈ నెల 12వ తేదీన చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయబోతోండటం ఇది రెండోసారి. మొత్తంగా నాలుగోసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, రాష్ట్ర విభజన అనంతరం తొలిసారిగా 2014లో ప్రమాణ స్వీకారం చేశారాయన. ఇప్పుడు మళ్లీ ఈ పదవిని అందుకోబోనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముందే కేంద్ర ప్రభుత్వం ఏపీకి గుడ్ న్యూస్ ఇచ్చింది. వేల కోట్ల రూపాయలను విడుదల చేసింది. జూన్ నెలలో ట్యాక్స్ డెవల్యూషన్‌లో భాగంగా విడుదల చేసిన నిధులు ఇవి. అదనంగా మరో ఇన్‌స్టాల్‌మెంట్‌ను కూడా కేంద్రం ఇందులో జమ చేసింది. రాష్ట్రంలో నిలిచిపోయిన అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి, మూల ధన వ్యయాల కోసం ఈ మొత్తం ఉపయోగపడుతుంది. ఏపీ సహా మిగిలిన రాష్ట్రాలన్నింటికీ కలిపి 1,39,750 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అంటే 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో రాష్ట్రాలకు పన్నుల రూపంలో చెల్లించాల్సిన మొత్తం 12,19,783 కోట్లు. ఇందులో భాగంగా ఈ నిధులు విడుదల అయ్యాయి. ఏపీ వాటాగా 5,655.72 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్- రూ.2,455.44, అస్సాం- రూ. 4,371.38, బిహార్- రూ. 14,056.12, ఛత్తీస్‌గఢ్- రూ. 4,761.30, గోవా- 539.42, గుజరాత్- 4,860.56, హర్యానా- 1,527.48, హిమాచల్ ప్రదేశ్- రూ. 1,159.92 కోట్లు విడుదల అయ్యాయి. జార?ండ్- రూ. 4, 621.58, కర్ణాటక- రూ. 5,096.72, కేరళ- రూ. 2,690.20, మధ్యప్రదేశ్- రూ. 10,970.44, మహారాష్ట్ర- రూ. 8,828.08, మణిపూర్- రూ.1,000.60, మేఘాలయ- రూ. 1,071.90, మిజోరం- రూ. 698.78, నాగాలాండ్- రూ. 795.20, ఒడిశా- రూ. 6,327.92 కోట్లను కేంద్రం విడుదల చేసింది. పంజాబ్- రూ. 2,525.32, రాజస్థాన్- రూ.8,421.38, సిక్కిం- రూ. 542.22, తమిళనాడు- రూ. 5,700.44, తెలంగాణ- రూ. 2,937.58, త్రిపుర- రూ.989.44, ఉత్తర ప్రదేశ్- రూ. 25,069.88, ఉత్తరాఖండ్- రూ. 1,562.44, పశ్చిమ బెంగాల్- 10,513.46 కోట్లను కేంద్రం మంజూరు చేసింది.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి బండి సంజయ్..



టీడీపీ అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. గన్నవరంలోని కేసరపల్లి ఐటీ పార్కు దగ్గర 14 ఎకరాల్లో ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధాని మోడీ సహా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. అంతేకాకుండా.. ఇతర పార్టీల నేతలు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకాబోతున్నారు. రేపటి ప్రమాణ స్వీకారానికి చాలా మంది వీవీఐపీలు ఇవాళే గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు. వారికి ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. ఈరోజు రాత్రికి ఆయన విజయవాడకు చేరుకోనున్నారు. రాత్రి 9:30 కి గన్నవరం ఎయిర్ పోర్టుకు అమిత్ షాతో కలిసి బండి సంజయ్ రానున్నారు. రాత్రి 10:20 కి సీఎం చంద్రబాబుతో అమిత్ షా భేటీ నిర్వహించనున్నారు. ఈ భేటీలో ముఖ్య నేతలు పాల్గొననున్నారు. అనంతరం రాత్రికి 11:20 కి నోవోటెల్ కు చేరుకుని బస చేయనున్నారు. రేపు ఉదయం చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని.. అనంతరం తిరిగి ఢిల్లీకి వెళ్ళనున్నారు.

# అత్యున్నత ఐదువేలు

దాదాపు నూట నలభై కోట్ల మంది భారతీయుల్లో ఒక పదకొండు వేల మంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది? పోనీ నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల నుంచి, ఐదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల నుంచి కలిపి వేయిమంది తలా వంద రూపాయలు ఇస్తే ఎంతవుతుంది?

**లెక్క తరువాత మాట్లాడుదాం.**



'సినిమా రంగంలో రచయితకు అత్యంత తక్కువగా డబ్బు ఇవ్వాలని నిర్మాతకు ఎందుకనిపిస్తుందంటే అతను ఖాళీ చేతులతో వస్తాడు కనుక' అని రచయిత సౌదా అంటాడు. నిజమే. మేకప్ వేసేవాడు పెద్ద కిట్ తెస్తాడు. విగ్గులకు డబ్బు అడుగుతాడు. కాస్ట్యూమ్ డిజైనర్ బోలెడన్ని బట్టలు కొనాలి కనుక బిల్లు ఎక్కువ. సినిమాటోగ్రాఫర్ కెమెరాలు, లెన్సులు, క్రేన్లు, భారీ పరికరాలు... ఇన్ని వాడుతున్నాడంటే అతనికి ఎంతిచ్చినా తక్కువే. కళా దర్శకుడు వేసే సెట్ కనిపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ దగ్గర వాద్యాల బృందం కనిపిస్తుంది. మరి రచయిత దగ్గరో? ఒక తెల్లకాగితం, పెన్ను. ఐదు రూపాయల పెన్ను జేబులో పెట్టుకుని వచ్చేవాడికి, కాగితం మీద అప్పటికప్పుడు రాసిచ్చి వెళ్లేవాడికి డబ్బు ఇవ్వడం అవసరమా అని నిర్మాతకేం ఖర్మ, ఎవరికైనా అనిపిస్తుంది. చిత్రమేమిటంటే సినిమా 'సీన్ పేపర్' నుంచే మొదలవుతుంది. దానిని రచయితే రాయాలి. తన దగ్గరకు వచ్చిన ఆసామీకి టీ ఇచ్చి, అతను తాగి కప్పు దించే లోపలే పాట రాసి ఇచ్చాడట ఆత్రేయ. 'ఐదు నిమిషాల్లో రాశారు. దీనికింత డబ్బు ఇవ్వడం అవసరమా' అన్నాడట ఆసామీ లాల్చీ జేబులో చేయి పెట్టి నసుగుతూ. ఆత్రేయ మొహమాటపడక డబ్బు అందుకుని 'ఈ ఐదు నిమిషాల వెనుక ముప్పై ఏళ్ల తపస్సు ఉంది నాయనా' అన్నాడట. రచయిత చేతికి పని చెప్పే మెదడు ఉందే, అది రాతకు తయారుగా ఉందే, ఆ మెదడు అలా తయారు కావడానికి రచయిత ఏమేమి చేసి ఉంటాడు? ఎన్ని రాత్రులను పుస్తకాలు చదువుతూ తగలెట్టి ఉంటాడు ఎన్ని తావుల్లో తిరుగుతూ మనుషుల్లో పాత్రలను వెతుకుతూ వారి చెమట, కన్నీరు, రక్తపు చారికలు పూసుకుని ఉంటాడు? వారి సద్బుద్ధుల చందనంలో, దుర్బుద్ధుల దుర్గంధంలో వారే తానై బతికి ఉంటాడు? ఆ రాత్రి ఉదయించిన సంపూర్ణ చంద్రుడి రంగును సరైన మాటల్లో వర్ణించడానికి ఎన్ని గుప్పుల పొగను తాగి ఊపిరిని నలుపు చేసుకుని ఉంటాడు? ఒక గొప్ప వాక్యం కోసం ఎన్ని వందల కాగితాలను చించి ఉంటాడు? ఒక కావ్యజన్మ కోసం ఎన్ని ఊహా పరిష్వంగాలలో పదేపదే సొమ్మసిల్లి ఉంటాడు? లాల్చీ, పైజామా, జేబులో పెన్నుతో అతడు ఎదురు పడినప్పుడు- అవశ్యం- అతని మేధాశ్రమ ఏదీ కనిపించదు. కనుక కలం పట్టి అతను రాసే రాతకు అత్యల్ప రుసుము ఇవ్వవచ్చనే ఆనవాయితీ ఎవరైనా పాటించవచ్చు. కథకు, కవితకు 500 రూపాయల పారితోషికం ఇవ్వొచ్చు. ఇవ్వక ఎగ్గొట్ట వచ్చు. పదుగురిని అడిగో, పి.ఎఫ్ బద్దలు కొట్టో పుస్తకం వేస్తే అమ్మిన ప్రతుల సొమ్ము అమ్మకందారు ఇవ్వొచ్చు. ఇవ్వక పోవచ్చు. పబ్లిషర్లు ఎవరైనా ఉంటే వారు రాయల్టీ ఇవ్వొచ్చు. ఇవ్వకపోనూవచ్చు. ఒకసారి రచయిత పుస్తకం వేశాక వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ తదితరాలలో ఉండే సాహితీ సూక్ష్మక్రిములు అది తమ సొంతంగా భావించి వందలాది పి.డి.ఎఫ్‌లు పంచొచ్చు... పుస్తకం కొనకనే చదువుకోవచ్చు. ఇవన్నీ ఇలాగుంటే తెలుగునాట సాహితీకారులను ప్రోత్సహించడానికి 'ఐదు వేలు' అనే అచ్చొచ్చిన నంబర్ ఒకటి ఉంది. పాతిక, ముప్పై ఏళ్ల క్రితం మొదలైన 'ఐదు వేల రూపాయల' అవార్డు/బహుమతి తెలుగు సాహితీజాతికి లక్ష్మణరేఖ. నేటికీ, 2024లో కూడా, 'చార్జీలతో కలిపి 5000 రూపాయల' అవార్డు ప్రకటిస్తే అదే పదివేలనుకుని భార్యాపిల్లలను వెంటబెట్టుకువెళ్లే దుఃస్థితి తెలుగు రచయితది. తెలుగు నేలన ఎక్కడ పట్టినా నేటికీ 'మొదటి బహుమతి 5 వేలు, రెండవ బహుమతి 3 వేలు, మూడవ బహుమతి వేయి రూపాయల' దిక్కుమాలిన కథాపోటీలు. వాటికి రాసే సీనియర్ రచయితలు! సాహితీ అకాడెమీ పురస్కార గ్రహీతలు! వెయ్యి రూపాయల లిస్ట్‌లో వీరి పేర్లు! రూపాయి ఊసెత్తక తలపాగా, ముఖం తుడవను పనికిరాని శాలువాతో ఇచ్చే అవార్డులు కొల్ల. వీటికి తోడు 116 డాలర్లు మొహానకొట్టే ఎన్ .ఆర్.ఐ వితరణశీలత ఏమని చెప్పుట? ఇంటికి చెద పట్టిందని ఫోన్ చేస్తే ఐదు వేలకు తక్కువగా ఎవరూ రావడం లేదు. గంట కార్పెంటర్ పని చేస్తే రెండు వేలు నిలబెట్టి వసూలు చేస్తాడు. ప్లంబర్ వచ్చి వాష్‌బేసిన్ వైపు చూడాలంటే కనీస వెల వెయ్యి. కాని తెలుగు రచయిత మాత్రం తన దశాబ్దాల తపస్సుకు 'బాబూ... ఒక్క ఐదు వేలు' అంటున్నాడు. తెలుగు సాహితీవరణంలో నిషేధించాల్సిన ఒకే ఒక నంబర్- ఐదు వేలు! 140 కోట్ల భారతీయులలో పదకొండు వేల మంది వంద రూపాయలు ఇస్తే పదకొండు లక్షలు అవుతాయి. అది మన జ్ఞానపీట్‌అ వార్డు నగదు బహుమతి! 9 కోట్ల తెలుగువారిలో వెయ్యి మంది వంద రూపాయలు ఇస్తే లక్ష అవుతుంది. అది సాహిత్య అకాడెమీ నగదు బహుమతి. జీవితంలో ఒకసారి పొందే వీటి నగదులే ఇలా ఉంటే ఐదు వేల అవార్డుకు వంకలేల అంటారా? ఆ అత్యున్నత అంకెతో అత్యల్పంగా బతికేద్దాం!

# అంతరిక్ష కేంద్రంలో 'స్పేస్ బగ్' .. ఇబ్బందుల్లో సునీతా విలియమ్స్!

భారత సంతతికి చెందిన ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్(59) మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లారు. బోయింగ్ స్టార్‌లైనర్ అంతరిక్ష నౌక ద్వారా మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో సురక్షితంగా అంతరిక్ష కేంద్రం (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్)కు చేరుకున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీతా విలియమ్స్‌తో సహా 8 మంది సిబ్బందికి 'స్పేస్ బగ్' రూపంలో ఇబ్బంది వచ్చిపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సూపర్ బగ్‌గా పిలిచే 'ఎంటర్‌బాక్టర్ బుగాన్‌డెన్సిస్' అనే బాక్టీరియా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్ష వాతావరణంలో ఈ బ్యాక్టీరియా మరింత బలం పెంచుకుంటోందని తెలిపారు. ఇది అనేక ఔషధాలను నిరోధించగలిగే శక్తివంతమైనదని వివరించారు. ఈ బ్యాక్టీరియా మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ కావడం వల్ల దీన్ని 'సూపర్ బగ్'గా పిలుస్తారని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఇది శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఈ స్పేస్ బగ్‌తో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునితా విలియమ్స్ సహా మిగిలిన ఎనిమిది మంది సిబ్బంది ఇబ్బందుల్లో పడనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా అంతరిక్ష కేంద్రం.. కదిలే అంతరిక్ష శిధిలాల వల్ల ఆందోళన వ్యక్తం చేస్తుంది. అయితే ఒకరి నుంచి మరొకరి వ్యాపించే 'స్పేస్ బగ్' గత



కొన్ని ఏళ్ల నుంచి అభివృద్ధి చెందటం మరింత ఆందోళన కలిగిస్తోందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వ్యోమగాములు అంతరిక్ష యాత్రల సమయంలో ఆరోగ్యపరంగా సవాళ్లను ఎదుర్కొంటారని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఆస్ట్రోనాట్స్ ఆరోగ్యం కోసం 'స్పేస్ బగ్' ప్రభావాన్ని, ప్రతికూలతలను అంతరిక్ష కేంద్రం త్వరగా అంచనా వేయటం కీలమని పేర్కొంటున్నారు. సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఆస్ట్రోనాట్ బారీ యూజీన్ బుచ్ విల్మోర్ జూన్ 6, 2024 న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సునిత డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని కూడా వ్యక్తం చేశారు. అయితే వారు వారం రోజులు పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండి.. అనంతరం భూమిపైకి తిరిగి వస్తారు.

## 3.0లో మోదీ తొలి విదేశీ పర్యటన.. ఎక్కడికంటే..



దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ వారంలో ఇటలీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆ దేశంలో జరగబోయే జీ7 దేశాల వార్షిక సదస్సులో పాల్గొననున్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా ప్రాంతంలోని ఓ లగ్జరీ రిసార్ట్‌లో జూన్ 13-15 తేదీల్లో జీ7 దేశాల సదస్సు జరగనుంది. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, జపాన్, కెనడా ప్రధానులు ఫుమియో కిషిదా, జస్టిన్ ట్రూడో తదితర నేతలు దీనికి హాజరుకానున్నారు. ఈ సమావేశం నిమిత్తం జూన్ 13న ప్రధాని మోదీ ఇటలీ వెళ్లి.. 14వ తేదీ రాత్రికి తిరిగి స్వదేశానికి రానున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే, దీనిపై కేంద్రం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ప్రధాని వెంట కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ తదితర ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం ఇటలీ వెళ్లనున్నట్లు సమాచారం. సదస్సులో భాగంగా పలువురు ప్రపంచ నేతలతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. అయితే దౌత్య విభేదాలు కొనసాగుతున్న వేళ కెనడా ప్రధాని ట్రూడోతో ముఖాముఖీ భేటీ ఉంటుందా? లేదా? అనే దానిపై మాత్రం స్పష్టత లేదు. కొత్త సీఎంకు 'నివాసం' కరవు.. ఒడిశాలో వింత పరిస్థితి..! గతేడాది జపాన్‌లోని హిరోషిమా వేదికగా జరిగిన జీ7 దేశాల సదస్సుకు మోదీ హాజరైన సంగతి తెలిసిందే. అందులోభాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇతర ప్రపంచ నేతలతో ఆయన చర్చలు జరిపారు. ఈ ఏడాది కూడా ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో పాటు గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం అంశాలపై నేతలు చర్చలు జరిపే అవకాశాలున్నాయి. జీ7 కూటమిలో అమెరికా, యూకే, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, కెనడా, జపాన్ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ వార్షిక సమావేశానికి భారత్‌తో పాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని 11 అభివృద్ధి చెందుతున్న దేశాల నేతలను ఇటలీ ఆహ్వానించింది.


## రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి..

అధికారులకు సూచన



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవాణా శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా చట్టానికి లోబడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. త్రైమాసిక టాక్స్ వసూలుకు సంబంధించి తక్కువగా నమోదు చేసిన వివిధ జిల్లాల అధికారులకు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి రాని అధికారులపై నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రిగా మొదటిసారి డిటిసిలో సమావేశాన్ని ఏర్పాటు చేశామని అధికారులు హుందాగా వ్యవహరిస్తూ, రవాణా శాఖ గౌరవాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న రవాణా శాఖ కార్యాలయాలకు కావల్సిన సొంత భవనాల కోసం ల్యాండ్ సెర్చ్ చేయాలని ముఖ్యమంత్రితో చర్చించి సొంత భవనాల సమస్య పరిష్కారించుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఆదాయ అన్వేషణలో విచక్షణ రహితంగా వేధింపుల వల్ల కాకుండా చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు. జిల్లాల్లో విధిగా వాహనాలు తనిఖీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్?లు పూర్తి చేయాలని సూచించారు. అధికారులు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న రవాణా శాఖకు సంబంధించిన వాహనాలను ఒకే గూటికి తీసుకొచ్చే విధంగా స్టిక్కరింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డు భద్రత పై రవాణా శాఖ అన్ని స్కూల్స్, కాలేజీల్లో రోడ్డు సేఫ్టీ అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి స్కూల్ బస్సును తనిఖీ చేయాలని డ్రైవర్లకు, స్కూల్ బస్సులకు కచ్చితంగా ఫిట్నెస్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత పై రవాణా శాఖ అధికారులు జిల్లాలో కలెక్టర్ ప్రాభవిక వ్యక్తులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. వారం రోజుల పాటు స్కూల్ లు, కాలేజీల్లో ఈ కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి రోడ్డు భద్రత పై కనీస అవగాహన ఉండేలా చూసుకోవాలన్నారు. స్కూల్ బస్సుకి సంబంధించి డ్రైవర్, క్లీనర్ బస్సు సమయాలు తెలిపే విధంగా.. ప్రతి పాఠశాల యాజమాన్యం స్కూల్ బస్ యాప్ లో అప్డేట్ చేస్తే పూర్తి సమాచారం తల్లిదండ్రులకు తెలిసేలా ప్రమాదాలు నివారించేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పాటు గతంలో కారు డోర్ లకు బ్లాక్ ఫిలిం గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ఉన్న చెక్ పోస్టులను ఎన్?ఫోర్స్ మెంట్?ను మరింత బలపరిస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. సీజ్ అయిన వాహనాలకు సంబంధించి పాలసీలో ఉన్న విధంగా వ్యవహరించాలని వాహనాలను భద్రపరిచే ప్రదేశలపై జిల్లా పోలీస్ అధికారులతో కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు. హైదరాబాదు ఆటో రిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సిఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ విషయంలో అవినీతికి ఆస్కారం లేకుండా డిసెంట్రలైజ్ ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని ఏదైనా భిన్న ఆలోచన వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం..
# రాజ్‌భవన్‌కు చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సిద్ధం అయ్యారు.. అందులో భాగంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యేలు ఆయన్ని శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న విషయం విదితమే.. ఇక, ఆ తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో సమావేశమైన కూటమి నేతలు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పురంధేశ్వరి.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు.. టీడీపీ అధినేత చంద్రబాబుకు మద్దతిచ్చిన 164 మంది సభ్యుల జాబితాను ఈ సందర్భంగా గవర్నర్‌కు అందజేశారు.. సాయంత్రంలోపు చంద్రబాబును ప్రభుత్వ ఏర్పాటుకు పిలుస్తామని గవర్నర్ వ్యాఖ్యానించినట్టు ఎన్డీయే కూటమి నేతలు వెల్లడించిన విషయం విదితమే.. కాగా.. ఆ తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానించారు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. దీంతో.. రాజ్‌భవన్‌కు చేరుకున్నారు కాబోయే ముఖ్యమంత్రి.. ప్రభుత్వ ఏర్పాటు.. మంత్రుల కూర్పు విషయాన్ని గవర్నర్‌కు వివరించారు చంద్రబాబు నాయుడు. ఇక, రేపు ఉదయం 11.27 గంటలకు ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, హెూంశాఖ మంత్రి అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు.. ఇప్పటికే గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వీఐపీల తాకిడి మొదలైంది.. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి సిద్ధం అవుతున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.. రేపు గన్నవరం ఐటీ పార్క్ దగ్గర.. నాల్గో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు.. ఇక, చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తుది దశకు చేరుకున్నాయి ఏర్పాట్లు.. గన్నవరం ఐటీ పార్కు దగ్గర 14 ఎకరాల్లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు.. ప్రధాని నరేంద్ర మోడీ సహా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల అగ్రనేతలు హాజరుకానున్నారు.. రేపు ఉదయం 10.45 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు విజయవాడలో ఉండనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ.. వీఐపీల తాకిడి నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు అధికారులు.. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎస్ నీరభ్ కుమార్ సమీక్ష నిర్వహించారు.. ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై సీఎస్, డీజీపీతో నిన్నే సమీక్ష జరిపారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు..

# మిషన్ 100 డేస్' ఎజెండాతో ముందుకెళ్తాం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి- బొగ్గు కొరత లేకుండ, మరింత విద్యుదుత్పత్తిపై ఫోకస్ చేస్తానని వెల్లడి



న్యూఢిల్లీ : తనకు కేటాయించిన బొగ్గు, గనుల శాఖలపై ఒకట్రెండు రోజుల్లో అధికారులతో చర్చించి 'మిషన్ 100 డేస్ అజెండా'తో ముందుకెళ్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిల్లో బొగ్గు, గనులది కీలక పాత్ర అని చెప్పారు. ఆయా రంగాల్లో మరింత సక్సెస్ సాధించే దిశలో ముందుకెళ్తానన్నారు. సోమవారం శాఖల కేటాయింపు తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో బొగ్గు పాత్ర కీలకమని, బొగ్గు వెలికితీత, ఎగుమతి, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై పనిచేయాల్సి ఉంటుందన్నారు. మోడి తనపై ఉంచిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానే విశ్వాసం ఉందన్నారు. ప్రైవేటు రంగంలో చాలా సంస్థలు బొగ్గు గనుల వ్యవస్థలో భాగస్వాములుగా ఉన్నాయన్నారు. వారందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు. విద్యుదుత్పత్తి, స్టీల్ కంపెనీలకు బొగ్గు అవసరం ఉంటుందని వివరించారు. 2014కు ముందు దేశంలో విద్యుత్ కోతలుండేవని, మోడీ వచ్చాక బొగ్గు ఉత్పత్తి పెంచడం ద్వారావిద్యుత్ కోతల్లేని దేశంగా నిర్మించినట్టు చెప్పారు. ప్రస్తుతం దేశమంతా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగం రంగాల్లో డిమాండ్ పెరుగుతోందని గుర్తు చేశారు. ఈ అన్నీ అంశాలను దృష్టిలో పెట్టుకొని బొగ్గు కొరత లేకుండా, మరింత విద్యుదుత్పత్తి పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. యూపీఏ హయాంలో బొగ్గు రంగంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కానీ మోడి పాలనతో పారదర్శకమైన విధానాలు తీసుకొచ్చి.. బొగ్గు తవ్వకం, సరఫరా, వినియోగం విషయంలో అవినీతి లేకుండా పని చేస్తున్నట్టు చెప్పారు. బొగ్గు, గనుల శాఖలు దేశానికి రెవెన్యూ తీసుకొచ్చే కీలకమైన మంత్రిత్వ శాఖలన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వాలకు ఆదాయాలు పెంచే విషయంలో ప్రత్యేక చొరవతీసుకుంటామని చెప్పారు. అయితే గనులు ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉంటాయని వివరించారు. ఇసుకతోపాటుగా చాలా వరకు ఖనిజాల వెలికితీతపై గనుల శాఖ పర్యవేక్షిస్తోందన్నారు.

### వరంగల్ విమానాశ్రయం కోసం కృషి చేస్తా

తాజా కేబినేట్లో తెలుగు రాష్ట్రాల మంత్రులకు మంచి పోర్ట్ పోలియోలు దక్కాయని కిషన్ రెడ్డి అన్నారు. కీలకమైన శాఖలను కేటాయించిన మోడీకి ధన్యవాదాలు తెలిపారు. వీరందరిని కలుపుకొని తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషిచేస్తానని చెప్పారు. రామ్మోహన్ నాయుడుకు పౌర విమానయాన శాఖ దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు. రామోహ్మన్ నేతృత్వంలో విజయవాడ, హైదరాబాద్, విశాఖ, పుట్టపర్తి మొదలైన విమానాశ్రయాల సమర్థవంతమైన నిర్వహణ, అభివృద్ధికి బాటలు పడతాయని విశ్వసిస్తున్నానన్నారు. అలాగే వరంగల్ లో విమానాశ్రయం కోసం రామోహ్మన్ తో కలిసి తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు.

# వయసు మీరినా మోడీ కొనసాగుతారంటూ ముక్తాయింపు

### రూల్స్ మారాయా? 75 ఏండ్లు దాటినా మంత్రి పదవులు- స్వీయ నిబంధనకు బీజేపీ తూట్లు గతంలో నజ్మా, కల్రాజ్మా మినహాయింపులు తాజాగా మాట మార్చిన షా, నడ్డా



న్యూఢిల్లీ : 75 ఏండ్లు దాటిన వారికి ప్రభుత్వంలో పదవులు ఇచ్చే ప్రసక్తే లేదని బీజేపీ గతంలో స్పష్టం చేసింది. కానీ వృద్ధుడైన జితన్ రామ్ మాంఝీకి మంత్రి పదవి కట్టబెట్టడంతో తాను స్వయంగా విధించుకున్న నిబంధనకు తానే తూట్లు పొడిచినట్లయింది. 79 సంవత్సరాల మాంఝీ ప్రస్తుత క్యాబినెట్లో అందరి కంటే పెద్దవారు. హిందుస్థానీ ఆవామ్ మోర్చా (హెచ్ఏఎం) పార్టీ నాయకుడు. వాస్తవంగా క్యాబినెట్లో 75 సంవత్సరాలు, ఆపై వయసున్న మంత్రులను 2016 జూన్లో మోడీ తొలగించారు. వయసు కారణంగానే వీరిని తప్పించామని వివరణ ఇచ్చారు. నిజానికి ఈ ప్రక్రియను 2014 ఎన్నికల్లో విజయం తర్వాతే మోడీ మొదలు పెట్టారు. ఆ ఎన్నికల్లో బీజేపీ తొలిసారిగా సొంత బలంపై అధికారంలోకి వచ్చింది. వృద్ధ నేతలను పరిపాలనా సంబంధమైన పదవుల్లో నియమించకూడదని మోడీ అప్పుడే నిర్ణయించారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం బీజేపీ మార్గనిర్దేశక మండలిని ఏర్పాటు చేసింది. 75 సంవత్సరాల వయసు దాటిన ఎల్కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, యశ్వంత్ సింగ్ వంటి నేతలను అందులో చేర్చారు. 2016 జూన్లో మోడీ తన మంత్రిమండలిని విస్తరించారు. దానికి ముందే ఆయన ఆరుగురు మంత్రుల నుంచి రాజీనామాలు తీసుకున్నారు. అప్పటికే 76 సంవత్సరాల నజ్మా హెప్తుల్లా క్యాబినెట్లో సీనియర్ మంత్రి. ఆమె మైనారిటీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

### వారిద్దరికీ మినహాయింపులు

2016 జూలై 12న నజ్మా తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం ముక్తార్ అబ్బాస్ నక్వీకి ఆ బాధ్యతలు అప్పగించారు. వయసు మీరినప్పటికీ నజ్మాను మణిపూర్ గవర్నరుగా పంపారు. నజ్మా మంత్రిపదవికి రాజీనామా చేసే సమయానికి క్యాబినెట్లో కల్రాజ్ మిశ్రా మంత్రిగా ఉన్నారు. ఆయన వయస్సు కూడా 75 సంవత్సరాలు దాటింది. ఆ సమయంలో కల్రాజ్ నుండి మాత్రం రాజీనామా తీసుకోలేదు. కల్రాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయనను మంత్రిమండలిలో కొనసాగించారు. యూపీ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత 2017 సెప్టెంబరులో కల్రాజ్ తన పదవికి రాజీనామా చేశారు. తన వయస్సు 77 సంవత్సరాలని, అందుకే రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు.

### మాట మార్చారు

రాష్ట్రాల్లో కూడా బీజేపీ ప్రభుత్వాలు 75 సంవత్సరాలు దాటిన మంత్రులను తొలగించాయి. 2016లో మధ్యప్రదేశ్లో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం ఇద్దరు మంత్రులను తప్పించింది. గుజరాత్ ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ కూడా రాజీనామా చేశారు. 2019 ఎన్నికలకు ముందు అమిత్ షా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 75 సంవత్సరాలు దాటిన వారికి టిక్కెట్లు ఇవ్వకూడదని బీజేపీ నిర్ణయించిందని చెప్పారు. కొద్ది రోజుల్లో మోడీకి కూడా 75 సంవత్సరాల వయసు వస్తుందని, నిబంధనల మేరకు ఆయన కూడా రాజీనామా చేయాల్సి ఉంటుందని పలువురు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా పలు సందర్భాల్లో ఈ విషయాన్ని గుర్తు చేశారు. అయితే దీనిపై అమిత్ షా వివరణ ఇస్తూ బీజేపీ రాజ్యాంగంలో వయసుకు సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవని, రాబోయే ఐదు సంవత్సరాలు కూడా మోడీయే ప్రధానిగా కొనసాగుతారని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు జేడీ నడ్డా కూడా ఇవే మాటలు వల్లె వేశారు.ుప్రస్తుత మోడీ క్యాబినెట్లోని మంత్రుల సగటు వయసు 58 సంవత్సరాలు. 2019లో మోడీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు మంత్రుల సగటు వయసు 61 సంవత్సరాలు. 2021లో క్యాబినెట్ విస్తరణ తర్వాత అది 58 సంవత్సరాలకు తగ్గింది.

# సరికొత్త సంకీర్ణ విన్యాసం



ఆహూతులైన వివిధ దేశాల ప్రభుత్వాధినేతలు, అనేక రంగాల ప్రముఖులు, వేలాది జనం సాక్షిగా, రాష్ట్రపతి భవన్ వేదికగా ఆదివారం రాత్రి నరేంద్ర మోదీ కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. భారత ప్రధాని స్వర్గీయ నెహ్రూ తర్వాత మళ్ళీ వరుసగా మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన మరో వ్యక్తిగా మోదీ చరిత్ర సృష్టించారు. ప్రధాన మంత్రి కిసాన్ నిధి నుంచి 17వ విడతగా 9.3 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ. 20 వేల కోట్లు పంపిణీ చేసే ఫైలుపై తొలి సంతకంతో సోమవారం ఉదయమే మోదీ పనిలోకి దిగిపోయారు. మొదటి రెండు పర్యాయాలు బీజేపీ సొంత బలంతో 'మోదీ సర్కార్'గానే పాలన చేసిన కమలనాథులు ఈ మూడోసారి మాత్రం చాలినంత సంఖ్యాబలం లేక, మిత్రపక్షాల అండతో అచ్చమైన 'ఎన్డీఏ సర్కార్'గా పని చేయాల్సి రావడం కొత్త పాలనలోని పెద్ద మార్పు. గతంలో గుజరాత్ సీఎంగా కానీ, ఆ తరువాత గడచిన పదేళ్ళుగా ప్రధానిగా కానీ తన మాటే శాసనంగా చలామణీ అయిన మోదీ ఇప్పుడు వివిధ ప్రాంతాలు, పార్టీలు, ఆశలు, ఆకాంక్షలకు చెవి ఒగ్గి, ఏకాభిప్రాయసాధనలో ఏ మేరకు విజయం సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. జనరల్ (24), ఓబీసీ (27), ఎస్సీ (10), ఎస్టీ (5), మైనారిటీలు (5)... ఇలా వివిధ వర్ణ శోభితమైన హరివిల్లుగా మొత్తం 71 మంది సహచరులతో మోదీ సారథ్యంలో కొత్త మంత్రి మండలి ఏర్పాటైంది. మొత్తం 81 మంది మంత్రి పదవులకు అవకాశం ఉండగా ఏకంగా 71 మందిని తొలి విడతలోనే తీసుకున్న మోదీ 24 రాష్ట్రాలకు కేంద్రంలో ప్రాతినిధ్యం కల్పించినట్టయింది. అయితే, ప్రమాణ స్వీకారం జరిగిన అనేక గంటల తర్వాత సోమవారం రాత్రికి గాని మంత్రిత్వ శాఖల కేటాయింపు ప్రకటన వెలువడలేదు. ఏకపక్ష నిర్ణయాలు అలవాటైన ప్రభుత్వ పెద్దలు సంకీర్ణ ప్రభుత్వంలో అన్ని పక్షాలకూ సంతృప్తి కలిగేలా వ్యవహరించడంలోని ఇబ్బందిని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నట్టుంది. ఆ మాటకొస్తే ప్రమాణ స్వీకారానికి ముందు, ఆ తరువాత కూడా సంకీర్ణ పక్షాలలో కొన్ని బాహాటంగానే తమ అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఒక మంత్రి పదవి... అదీ సహాయ మంత్రి పదవే ఇవ్వడం, అందులోనూ గతంలో క్యాబినెట్ హెూదాలో పనిచేసిన ప్రఫుల్ పటేల్‌కు ఆ స్థాయి తక్కువ పదవి ఇవ్వడం పట్ల అజిత్ పవార్ సారథ్యంలోని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ప్రమాణ స్వీకారం కన్నా ముందు ఆదివారమే అభ్యంతరం చెప్పింది. మంత్రి పదవిని తిరస్కరించింది. గెలిచిన అనురాగ్ ఠాకూర్ నుంచి, ఓడిపోయిన స్మృతీ ఇరానీ దాకా పలు పాత ముఖాలకు కొత్త సర్కారులో మోదీ మొండిచేయి చూపారు. అదే సమయంలో 33 మందిని మొదటిసారి మంత్రుల్ని చేశారు. ఏపీ నుంచి ముగ్గురికి, తెలంగాణ నుంచి ఇద్దరికీ మంత్రులుగా బెర్తులిచ్చారు. ఆ లెక్కలెలా ఉన్నా, సోమవారం సాయంత్రం తొలిసారిగా కేంద్ర క్యాబినెట్ భేటీ జరిగే లోగా... సంకీర్ణ సర్కారు నుంచి మరిన్ని గొంతులు పైకి లేచాయి. ఏడుగురు ఎంపీలున్న తమ కన్నా తక్కువ సంఖ్యాబలం గల పార్టీలకు క్యాబినెట్ హెూదా మంత్రి పదవిచ్చి, తమకు మాత్రం స్వతంత్ర హెూదా ఉన్న సహాయ మంత్రి పదవితోనే సరిపుచ్చారంటూ ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన అసమ్మతి వ్యక్తం చేసింది. సొంత గూటిలోనూ బీజేపీకి సణుగుళ్ళు తప్పట్లేదు. కేరళలో తొలిసారిగా ఖాతా తెరిచిన కమలం పార్టీ త్రిస్సూర్ నుంచి గెలిచిన సినీ నటుడు సురేశ్ గోపికి మంత్రిమండలిలో స్థానం కల్పించింది. అయితే, సహాయ మంత్రి హెూదా ఇచ్చినందుకు కినిసి ఆయన పక్కకు తప్పుకోవడానికి సిద్ధమైనట్టు వార్తలు రావడం, రచ్చ రేగేసరికి ఆఖరుకు ట్విట్టర్‌లో అలాంటిదేమీ లేదని ఖండించడం చకచకా జరిగాయి. వీటిని బట్టి సంకీర్ణ సర్కార్ నడపడంలోని సవాళ్ళు మోదీకి ఆదిలోనే అర్థమై ఉండాలి. మరోపక్క మరికొద్ది నెలల్లోనే మహారాష్ట్ర, హర్యానా, జార?ండ్ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రాల్లో బలహీనంగా ఉన్న బీజేపీ అక్కడ మళ్ళీ బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తుంది. అలాగే, దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ క్యాబినెట్‌లో ప్రాతినిధ్యమూ కమలనాథుల 'మిషన్ సౌత్' వ్యూహంలో భాగమే. ఇక, వివిధ రాష్ట్రాలకు గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఆరుగురు ఇప్పుడు మోదీ క్యాబినెట్‌లో ఉన్నారు. స్వయంగా మోదీని సైతం కలుపుకొంటే ఆ సంఖ్య ఏడుకు చేరుతుంది. అంటే పాలనలో అనుభవానికి కొరత లేదు. కాకపోతే, వ్యక్తిగతంగా అధికారంలో శిఖరాలను చూసినవారు కలసికట్టుగా ముందడుగు వేయడంలో అహంభావాలకు తావు లేకుండా చూసుకోగలరా అని విశ్లేషకుల అనుమానం. అయితే, రక్షణ, ఆర్థిక, హెూమ్, విదేశీ వ్యవహారాల వంటి కీలక శాఖలను గత ప్రభుత్వంలోని మంత్రులకే కట్టబెట్టారు. ఇది కొత్త సీసాలో పాత సారాగా తోచినా, విధానాల కొనసాగింపు, సుస్థిరత్వానికి పెద్దపీట వేశారనుకోవాలి. వెరసి మోదీ ప్రజల కొత్త తీర్పుతో ఇప్పుడు కొత్త పిచ్ మీద ఆట మొదలుపెట్టారు. ఒకప్పటి వాజ్‌పేయి సంకీర్ణ సర్కార్‌లా సక్సెస్ కావాలంటే సహనం, సహానుభూతి పెంచుకోక తప్పదు. సంకీర్ణ సర్కారుకు తోడు బలమైన ప్రతిపక్షమూ ఉన్నందున పించ్ హిట్టింగ్‌కు అవకాశం లేదు. తిరుగులేని మెజారిటీ ఉన్న గతంలోలా ఇప్పుడు ఎవరికీ ముందస్తు సమాచారం ఇవ్వకుండానే పెద్ద నోట్ల రద్దు, దేశవ్యాప్త లాక్‌డౌన్ లాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం లాంటివి చేయలేరు. వివాదాస్పదమైన ఒకే దేశం - ఒకే ఎన్నిక, ఉమ్మడి పౌరస్మృతి లాంటి సొంత అజెండాను కాషాయధ్వజులు కొన్నాళ్ళు పక్కనపెట్టక తప్పదు. ఆటలో దూకుడుకు అవకాశం లేనప్పుడు అవుటవకుండా ఆత్మరక్షణ ధోరణిలో ఆడక తప్పదు.

పదేళ్ళుగా ప్రాంతీయ పార్టీలను సామ దాన భేద దండోపాయాలతో ఆడిస్తున్న పెద్దలకు కచ్చితంగా ఈ సంకీర్ణపు ఆట సరికొత్తదే! అలాగే పెరిగిన బలంతో ఊపిరి పీల్చుకున్న ప్రతిపక్షం సైతం 18వ లోక్‌సభలో కూటమిగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తేనే ప్రజలకు మేలు.